సంపుటి : 9
సంచిక : 287
శుక్రవారం
10 జులై 2026
పేజీలు : 12
వెల : 2/-

E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

10 YEARS CELEBRATING

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE



Contact For Ads:
7579339999

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం



- 2027 మార్చికి 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు
- వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ నల్లచట్టమే
- పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై ఫోటోల పిచ్చిని రాజముద్రతో తుడిచేశాం
- పురాణాల్ని దూషించి, పాకిస్తాన్‌ను సమర్థించిన రావణ్‌కు వైసీపీ ఆర్థిక సాయం
- ఓట్ల కోసం తండ్రి సమాధికి పూజలు చేస్తూ, బతికి ఉన్న తల్లికి ఆస్తి ఇవ్వక క్షోభ పెడుతున్నారు
- బనగానపల్లె మీ భూమి మీహక్కు బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**బనగానపల్లె, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం ఉండేలా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం స్పష్టం చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో భాగంగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ.. "గడచిన రెండేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ప్రజలకు అందుతోంది. గత పాలకుల పాపాలు ప్రజలకు శాపాలుగా మారాయి. లక్షల కుటుంబాలు వారి అరాచకానికి బలి అయ్యాయి. నచ్చని వారిని భయపెట్టేందుకు మిగతా .. 2లో..

## 22ఏ సంకెళ్లు తెంచిన ప్రభుత్వం

### గుటుపల్లి రైతుల ఆనందం

**బనగానపల్లె, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాల పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వందలాది రైతులకు ఊరట కలిగించారు. వేలాది ఎకరాలను 22-ఏ నుంచి విముక్తి కలిగించారు. అలాగే మరో 100 ఎకరాలను చుక్కల భూమి జాబితా నుంచి తప్పించారు. మూడు నెలల క్రితం తన దృష్టికి వచ్చిన సమస్యను పరిష్కరించాలని గతంలోనే అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు.. రాష్ట్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలను చేపట్టారు. నంద్యాల పర్యటనలో భాగంగా మిగతా .. 2లో..

కొరియన్ పెట్టుబడులకు

## ఏపీ స్వాగతం

ఏపీ మంత్రి నారా లోకేష్



**విశ్వం వాయిస్ న్యూస్ :** దక్షిణకొరియా రాజకీయ వ్యవహారాలు, విదేశాంగ శాఖ ఉపమంత్రి యుయ్-హే సిసిలియా చుంగ్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ సియోల్‌లో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలుచేస్తున్న 3ఎస్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్) విధానం కొరియా పెట్టుబడిదారులకు రక్షణ కవచంలా నిలుస్తుందని లోకేష్ తెలిపారు. భారత్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అత్యంత స్థిరమైన, నమ్మకమైన కేంద్రంగా చేసుకునేలా పరిశ్రమదారులను ప్రోత్సహించాలని కోరారు. ఏపీలో అందించే పన్నురాయితీలు, తక్కువధరకే భూమి, సబ్సిడీలు పరిశ్రమదారులకు మద్దతుగా మిగతా .. 2లో..

హైదరాబాద్‌లో రావణ్ ఇంటిని

## తనిఖీ చేసిన ఏపీ పోలీసులు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** వివాదాస్పద వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న యూట్యూబర్ రావణ్ అలియాస్ జోసెఫ్ ఇంటిని ఏపీ పోలీసులు తనిఖీ చేశారు. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు నిర్వహించిన తనిఖీల్లో ఎనిమిది మందితో కూడిన గన్నవరం పోలీసుల మిగతా .. 2లో..

ధాన్యం కొనుగోలులో

## రికార్డు సృష్టించాం

మంత్రి నాదెండ్ల మనోహర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో రెండేళ్ల ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తి కావడంతో విజయవాడలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతులు, రైస్ మిల్లర్లతో ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మిగతా .. 2లో..

మచిలీపట్నం అభివృద్ధే

## కూటమి ప్రభుత్వ లక్ష్యం

క్యాంప్ బెల్ గ్రామంలో హెడ్ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బందరు మండలం కానూరు శివారు చిన్న క్యాంప్ బెల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన హెడ్ వాటర్ ట్యాంక్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన వల్ల రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, ప్రతిపక్షాల పసలేని విమర్శలను తాము పట్టించుకోబోమని మండిపడ్డారు. బందరు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు జలజీవన్ మిషన్ కింద రూ. 200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. అలాగే, ఈ ప్రాంత రూపురేఖలను మార్చే మిగతా .. 2లో..

ఎస్పీకి వినతిపత్రం ఇవ్వడానికి కూడా

## మేము నారా లోకేష్ అనుమతి తీసుకోవాలా?

మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు



**ఉండవల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉండవల్లి ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వెళితే ఆయన లేరని మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు తెలిపారు. ముందుగా అపాయింట్‌మెంట్ ఇచ్చి కూడా తీరా అక్కడికి వెళ్లాక ఆయన అందుబాటులో లేరని చెప్పారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఉండవల్లి ఘటనలో విధుల్లో ఉన్న ఒక పోలీస్ కానిస్టేబుల్ తలకు మిగతా .. 2లో..

కాకినాడ జిల్లా తొండంగి వద్ద

## సముద్రంలో ప్రమాదం

సముద్రంలో మంటలు అంటుకుని ఇద్దరు మత్స్యకారులకు తీవ్ర గాయాలు
భోజనం వండేందుకు స్టవ్ ఆన్ చేయగా అంటుకున్న మంటలు
అందరినీ రక్షించిన మరో బోటులోని మత్స్యకారులు



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా జరుగుతున్న మత్స్యకారుల బోటు ప్రమాదాలు తీరప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా కాకినాడ జిల్లా తొండంగి వద్ద సముద్ర తీరంలో ఓ పడవ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఎల్లయ్యపేట గ్రామానికి చెందిన ఎరుపల్లి కోటేశ్, ఎరుపల్లి ప్రసాద్ అనే ఇద్దరు మత్స్యకారులు తీవ్రంగా మిగతా .. 2లో..

తిరుమలలో

## భారీ సర్పం

చాకచక్యంగా పామును బంధించి అడవిలో వదిలిన సిబ్బంది



**తిరుమల, విశ్వం వాయిస్ న్యూస్ :** పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుమలలో గురువారం భారీ పాము కలకలం రేపింది. నారాయణగిరి ఉద్యానవన షెడ్ ప్రాంతంలో సుమారు 9 అడుగుల పొడవున్న జెర్రిపోతు పామును గమనించిన భక్తులు, మిగతా .. 2లో..

నా ప్రాణం ఉన్నంత వరకు తోపుదుర్తిని

## రాజకీయంగా వెంటాడుతా


తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు



**అనంతపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అసత్య ఆరోపణలతో తన పరువుకు భంగం కలిగేలా వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి వ్యవహరించారని తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. తాను ప్రస్తావించిన అంశాలను రాజకీయంగా ఎదుర్కోవాలని చెప్పారు. గురువారం ఉదయం నుంచి అనంతపురంలో తోపుదుర్తి, ఎంఎస్ రాజు వర్గాల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఎంఎస్ రాజుపై తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని తెదేపా నేతలు డిమాండ్ చేశారు. తన కులాన్ని కించపరిచేలా మాట్లాడారని, చేసిన ఆరోపణలను సాయంత్రం 5 గంటలలోపు నిరూపించాలని ప్రకాశ్‌రెడ్డికి ఎం.ఎస్. రాజు సవాల్ విసిరారు. ఆ గడువు ముగిసిన అనంతరం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. "సొంత సామాజికవర్గం ఏకం కావాలని తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి పిలుపునిస్తున్నారు. నేను ఆత్మగౌరవ మిగతా .. 2లో..

హైదరాబాద్‌లో

## 'ఒలింపిక్స్' నా డ్రీమ్



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

**విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించాలనేది తన డ్రీమ్ అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, గచ్చిబౌలి స్పోర్ట్స్ డిస్ట్రిక్ట్‌ను భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షురాలు పీటీ ఉషతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం స్పోర్ట్స్ వర్సిటీ వెబ్‌సైట్, లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఆటలు, రాజకీయాలు, కెరియర్‌లో పీటీ ఉష మనందరికీ స్ఫూర్తి అని కొనియాడారు. రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకే స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చామని చెప్పారు. "ఆటల కోసం తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది. 1990-2004 మధ్య హైదరాబాద్ చాలా స్పోర్ట్స్ ఈవెంట్స్‌కు ఆతిథ్యం ఇచ్చింది. గత 20 ఏళ్లలో తెలంగాణలో ఎలాంటి పెద్ద ఈవెంట్స్ జరగలేదు. నవంబర్‌లో ఖేలో ఇండియా గేమ్స్‌కు మిగతా .. 2లో..


ఆర్టీసీలో ఏ ఒక్కరినీ తప్పించట్లేదు..

## దుష్ప్రచారాన్ని నమ్మొద్దు


రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్టీసీని ప్రైవేటీకరిస్తున్నారన్న వదంతులపై ఏపీ ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. అలాంటి ఆలోచన ఏదీ లేదని రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఆర్టీసీలో 750 ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెడుతున్నాం. కేంద్ర విధానాన్నే ఏపీలోనూ అమలు చేస్తున్నాం. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వడం లేదు. సంస్థపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దు. 11 నగరాల్లో పీఎం ఈ-బస్ సేవా స్కీమ్ కింద బస్సులు నడుపుతున్నాం. రూ.1,774 కోట్లు ప్రోత్సాహకాల రూపంలో వస్తాయి. రాష్ట్ర ఎలక్ట్రిక్ బస్సుల్లో డ్రైవర్లుగా ఆర్టీసీ ఉద్యోగులే ఉంటారు. ఏ ఒక్క ఉద్యోగినీ మిగతా .. 2లో..





## మరోసారి పశ్చిమాసియాలో టెన్షన్..



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా మరోసారి దద్దరిల్లుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ తాజా పరిస్థితులపై మెల్‌బోర్న్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న అన్ని ఘర్షణలు దౌత్యం, చర్చలు ద్వారానే పరిష్కారం సాధ్యమవుతాయని పేర్కొన్నారు. మూడుదేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న మోదీ.. ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్‌తో కలిసి మిగతా .. 2లో..

బాలిస్టిక్ క్షిపణులతో అమెరికా

## మిలటరీ స్థావరాలపై ఇరాన్ దాడి



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియాలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారాయి. హర్మూజ్‌లోని నౌకలను ఇరాన్ అడ్డగించిన నేపథ్యంలో అమెరికా దాడులకు పాల్పడింది. దీంతో ఇరాన్ కూడా ప్రతి దాడులు ప్రారంభించింది. పశ్చిమాసియాలోని అమెరికా మిలటరీ స్థావరాలపై క్షిపణులతో మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# ప్రజల ఆస్తిపై ప్రజలకే అధికారం

వారి భూముల్ని గత పాలకులు 22ఏ కింద చేర్చారు. వివాదాలు సృష్టించి భూములు లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరిట ఓ నల్ల చట్టాన్ని తెచ్చారు. ప్రజల ఆస్తుల్ని కాజేసేలా భయాందోళనలు సృష్టించారు. ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు తేవటమే సమస్యను మరింత జటిలం చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ నల్ల చట్టాన్ని రద్దు చేశాం. భూ వివాదాల పరిష్కారానికి ధృఢ సంకల్పంతో ముందుకు వెళున్నాం. గత పాలకులు ప్రజల భూమి పత్రాలపైన, సర్వే రాళ్లపైనా ఫోటోలు ముద్రించుకున్నారు. ఆ ఫోటోల పిచ్చిని తుడిచేసేందుకు రాజ ముద్రతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తున్నాం. కట్టుదిట్టమైన భద్రతా ఫీచర్లను పెట్టి తప్పులు లేకుండా రైతులు, భూ యజమానులకు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. ఇదో ఉద్యమంగా, పవిత్రమైన కార్యక్రమంగా చేపట్టి భూ యజమానులకు హక్కులు కల్పిస్తున్నాం. 2027 మార్చి నాటికి 9833 గ్రామాల్లో 72,70.,605 పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ చేస్తాం. ఏపీని ఎలాంటి భూ వివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యం. విలేజ్ ఇనామ్ భూములను కూడా 22ఏలో పెట్టేశారు. వీటిని 1971 గ్రామాల్లో రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశాం. ఆటో మ్యూటేషన్ ద్వారా వారసత్వ ఆస్తుల్ని సంబంధిత వ్యక్తులకు చెందేలా చేస్తున్నాం. తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరులోని వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుందిలో చాలా ఏళ్లుగా ఉన్న భూ వివాదాలను పరిష్కరించాం. డోన్ నియోజకవర్గంలో ఉన్న 2074 ఎకరాల వక్ఫ్ భూముల్ని కూడా 22ఏలో గత పాలకులు పెట్టారు. ఆ భూముల్ని 22ఏ జాబితా నుంచి తొలగించి రైతుల సమస్యల్ని పరిష్కరించాం." అని సీఎం అన్నారు.

**వారు రాసింది రక్త చరిత్ర- మాది అభివృద్ధి సంకల్పం**

"రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యల్ని పరిష్కరించటంతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధికి పనిచేస్తున్నాం. రాయలసీమ ముఖ చిత్రాన్ని మారుస్తున్నాం. కడప స్టీల్ ప్లాంట్, హీరో మోటార్స్, అమ్కా డిఫెన్సు ఫైటర్ జెట్ ప్లాంట్ ఏర్పాటు అవుతోంది. డిఫెన్సు, ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ తదితర రంగాల్లో ప్రాజెక్టులు, ఉద్యోగ ఉపాధి అవకాశాలతో రాయలసీమ రతనాల సీమగా మారుతుంది. రాయలసీమలో తయారైన ఎన్ ఫీల్డ్ బుల్లెట్ లు దేశమంతా తిరుగుతాయి. రూ.40 వేల కోట్లు ప్రభుత్వ పెట్టుబడులు, ప్రైవేటు పెట్టుబడులతో రాయలసీమ హార్టీ కల్చర్ హబ్‌గా మారుతుంది. నగరాలు, పట్టణాల కంటే కడప జిల్లా లింగాల వంటి ప్రాంతాల్లోనే తలసరి ఆదాయం ఎక్కువ ఉంది. నంద్యాలలోనూ హార్టికల్చర్ అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సీజన్ లో 22 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. నీటిని పొదుపుగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉంది. అందుకే జలధార కార్యక్రమాన్ని కూడా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాం. నంద్యాల జిల్లాలో 18 కిలోమీటర్ల ఫీడర్ ఛానల్, చెక్ డ్యామ్ లు నిర్మించిన జిల్లా యంత్రాంగానికి అభినందనలు. వర్షపు నీటిని భూగర్భజలాలుగా మార్చుకుంటే నీటి భద్రత సాధ్యం అవుతుంది. రాయలసీమలో వారు రక్త చరిత్ర రాస్తే మేం అభివృద్ధి సంకల్పం చేస్తున్నాం. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రజా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోంది.ప్రజలకు అందిస్తున్న పథకాలు, కార్యక్రమాలు, సేవలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకుని దానికి అనుగుణంగా పనితీరు మెరుగు పర్చుకుంటున్నాం. ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించటమే ప్రభుత్వ లక్ష్యం. బాగా పనిచేసిన అధికారులను అభినందిస్తున్నాను. రాష్ట్రంలో మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తున్నాం. ఎవరు అఘాయిత్యానికి పాల్పడినా అదే వారికి చివరి రోజు అవుతుంది. రాష్ట్రంలో అత్యుత్తమ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్య, జీవన ప్రమాణాలు అందించాలని ఆలోచన చేస్తున్నాం." అని సీఎం స్పష్టం చేశారు.

**హే రామ్ అంటూ రావణుడికి సమర్ధనా?**

"కుట్రలు కుతంత్రాలతో కులం, మతం, ప్రాంతం, వర్గాలతో సమాజాన్ని విడగొట్టాలని గొడ్డలి పార్టీ ప్రయత్నం చేస్తోంది. గంజాయి బ్యాచ్ ను, బ్లేడ్ బ్యాచ్ లను, రౌడీయిజాన్ని వైసీపీ ప్రోత్సహిస్తూ రాష్ట్రంలో విధ్వంసం చేస్తోంది. అంతర్వేది రథం దగ్ధం, దుర్గమ్మ గుడిలో వెండి సింహాల చోరీ, రామతీర్థంలో రాముడి విగ్రహం ధ్వంసం చేసినా గత పాలకులు నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత పాలకులు తిరుపతి వెంకన్న ప్రసాదాన్ని కల్తీ చేశారు. హిందువుల మనోభావాలను దెబ్బతీశారు. ఇలాంటి ఘోరాలు చాలా చేశారు. ఇలాంటి వాటిని ప్రక్షాళన చేస్తున్నాం. రెండు రోజుల క్రితం ఆదోనిలో శివాలయంలోని దీపంలో ఓ దుర్మార్గుడు సిగరెట్ వెలిగించి అపచారం చేశాడు. వెంటనే కేసు పెట్టి నిందితుడ్ని అరెస్టు చేశాం. మత విద్వేషాలు రగిలించేలా ఎవరు దుశ్చర్యకు పాల్పడినా కూటమి ప్రభుత్వం క్షమించదు. సామాజిక మాధ్యమాల్లో కొందరు దుర్మార్గాలకు పాల్పడుతున్నారు. రావణ్ అనే వ్యక్తి పురాణాల్ని దూషిస్తాడు, మన రాముడిని, సీతపై నీచంగా మాట్లాడతాడు. తీవ్రవాదాన్ని , పాకిస్తాన్ ను సమర్థిస్తాడు. అలాంటి వారికి గొడ్డలి పార్టీ ఆర్థిక సాయం అందిస్తుంది. ఎంతటి బరితెగింపు ఇది. ప్రజలు దీనిని గుర్తించాలి. వారి పోకడలు ఏమిటో తెలుసుకోవాలి. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తినే దూషిస్తున్న వారికి సామాన్య ప్రజలు ఏం లెక్క. తిరుమలకు వెళ్లి డిక్లరేషన్ ఇమ్మంటే వాటిని తిరస్కరించి అపచారం చేశారు. నేను చర్చికి వెళ్లినా, మసీదుకు వెళ్లినా అక్కడి మతాచారాలను గౌరవిస్తాను. హే రామ్ అంటూ రావణుడ్ని ప్రోత్సహిస్తున్న వ్యక్తులను ఏమనాలో తెలీడం లేదు. కాలజ్ఞానం రాసిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కూడా ఇలాంటి వింతలు విచిత్రాలు జరుగుతాయని చెప్పారు. మతవిద్వేషాలు ఎవరు రెచ్చగొట్టే ప్రయత్నం చేసినా చూస్తూ ఊరుకోం. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన వాడే అని తెలిసి తోక ముడిచారు. ఓట్లు కోసం తండ్రికి పూజలు చేస్తున్నాడు. బ్రతికి ఉన్న తల్లికి మాత్రం ఆస్తి ఇవ్వకుండా క్షోభ పెడుతున్నాడు. ఇలాంటి వ్యక్తులు మన సమాజానికి అవసరమా. తల్లికి గౌరవం ఇవ్వని వ్యక్తులు మనకు ఎందుకు?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. అనంతరం బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు. వెదురుతో తయారు చేసిన ఆభరణాలను సీఎం ఆసక్తిగా పరిశీలించారు. డ్వాక్రా, మెప్మా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులను స్వయం బ్రాండ్ పేరిట మార్కెటింగ్ చేయాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్ రెడ్డి, ఎన్ఎండీ ఫరూఖ్, ఎంపీ బైరెడ్డి శబరి, జిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

# 22ఏ సంకెళ్లు తెంచిన ప్రభుత్వం

జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన ప్రక్రియను దగ్గరుండి చేయించి.. చిక్కుల్లో ఉన్న భూములకు విముక్తి కల్పించి... రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు. సీఎం చంద్రబాబు గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో పాల్గొని రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు. ఈ పర్యటన సందర్భంగా మూడు నెలల క్రితం డోన్ పర్యటనలో తనను కలిసిన బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామ రైతులను బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించుకున్నారు. ఈ ఏడాది మార్చి 9వ తేదీన డోన్ పర్యటన సందర్భంగా గుటుపల్లి రైతులు సీఎం చంద్రబాబును కలిసి తమకు చెందిన భూములను 22-ఏ జాబితాలో కలిపారని... వాటికి విముక్తి కల్పించాలని కోరారు. మూడు నెలల క్రితం తాను స్వీకరించిన అర్జీని పరిశీలించి పరిష్కరించమని ఆదేశించానని.. ఈ మేరకు రాష్ట్ర స్థాయిలో చేపట్టాల్సిన చర్యలను చేపట్టామని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన బేతంచర్ల రైతులతో ముఖ్యమంత్రి చెప్పారు. సదురు భూములను 22-ఏ జాబితా నుంచి తొలగించే ప్రక్రియ ఎంత వరకు వచ్చిందని ముఖ్యమంత్రి జిల్లా రిజిస్ట్రార్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ నుంచి తనకు అధికారిక తొలగింపు ఉత్తర్వులు ఇంకా అందకపోవడంతో ఆన్‌లైన్ తొలగింపు ప్రక్రియ ప్రారంభం కాలేదని జిల్లా రిజిస్ట్రార్ వివరించారు. దీంతో ముఖ్యమంత్రి సమక్షంలో జిల్లా కలెక్టర్ తొలగింపు ఉత్తర్వులను జిల్లా రిజిస్ట్రార్‌కు అందజేశారు... వాటిని స్వీకరించిన జిల్లా రిజిస్ట్రార్ త్వరలోనే ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి చెప్పారు. త్వరలో కాదు ఇప్పుడే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి నుంచి ఆదేశాలు రావడంతో అక్కడిక్కడే జిల్లా రిజిస్ట్రార్ సంబంధిత భూములను 22ఏ నుంచి తొలగించారు. దీంతోపాటు.. మరో అర్జీని క్లియర్ చేశారు. బనగానపల్లెకు చెందిన 101 ఎకరాలను కూడా చుక్కల భూమి జాబితా నుంచి జిల్లా రిజిస్ట్రార్ తప్పించారు. ఈ భూములకు విముక్తి కలగడంతో బేతంచర్ల మండలం గుటుపల్లి గ్రామానికి చెందిన 897 మంది రైతులకు ఊరట లభించింది. ఈ రైతులకు చెందిన 2,074 ఎకరాలు 22-ఏ నుంచి విముక్తి పొందాయి. అలాగే బనగానపల్లెకు చెందిన 23 మంది రైతుల 101 ఎకరాల చుక్కల భూములను నిషేధిత జాబితా నుంచి బయటపడ్డాయి. ఈ మేరకు సదురు భూములను 22-ఏ నుంచి విముక్తి కల్పించామన్న ఉత్తర్వులను ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు అందించారు. తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన వ్యవసాయ భూముల్ని వైసీపీ ప్రభుత్వం అన్యాయంగా 22ఏ జాబితాలో చేర్చడంతో వ్యవసాయ రుణాలు పొందలేక, రిజిస్ట్రేషన్లు చేయించుకోలేక, ఇతర భూ లావాదేవీలు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నామని రైతులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి వివరించారు. తమ సమస్య ఇంత త్వరగా పరిష్కారం అవుతుందని తాము ఊహించలేదని... అది స్వయంగా ముఖ్యమంత్రి ఈ తరహాలో చొరవ చూపుతారని తాము ఊహించ లేదని రైతులు చెప్పారు. తమ ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా రైతులకు సీఎం చంద్రబాబు వివరించారు.

**దశాబ్దాల తరబడి పెండింగులో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం**

బేతంచర్ల భూముల తరహాలోనే రాష్ట్రంలో మరిన్ని భూ వివాదాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెడుతోంది. ఇప్పటికే తిరుపతి జిల్లా శెట్టిపల్లి, గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు, చిత్తూరు జిల్లా కంగుంది గ్రామాల్లో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు పరిష్కారం చూపింది. ఇప్పుడు బేతంచర్ల మండలం గుటుపల్లి రైతులకు కూడా అదే తరహాలో ప్రభుత్వం న్యాయం చేసింది. రీ సర్వే పేరుతో భూములను గత ప్రభుత్వం 22-ఏలో చేర్చి రైతులకు తెచ్చిపెట్టిన ఇబ్బందులను ప్రజాప్రభుత్వం తొలగిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకుంటోన్న నిర్ణయాలతో 22ఏ నుంచి లక్షలాది ఎకరాలకు విముక్తి కలిగి... వేలాదిమంది రైతుల కళ్లలో సంతోషాన్ని నింపుతోంది. 2019-24 మధ్యనున్న ప్రభుత్వం చేసిన నిర్వాకంతో భూమి తమ పేరుమీదే ఉన్నా దానిని అమ్ముకోలేక, అవసరమైన సమయంలో రుణాలు పొందలేక రైతులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. ఇలా ఉన్న సమస్యల్లో అత్యధిక శాతం గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా ఉత్పన్నమైనవే. అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి రెవెన్యూ ప్రక్షాళన మీద దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకుంటోంది. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేస్తూ పట్టాదార్ పాస్ పుస్తకాలను కొత్తవి ముద్రించి ఇవ్వడంతోపాటు... సుదీర్ఘ కాలం పెండింగులో ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తోంది. అన్ని రకాల పరిశీలనలు జరిపించి నిషేధిత 22-ఏ జాబితాలో చిక్కుకున్న భూముల్ని విముక్తి చేస్తూ ప్రభుత్వం రైతులకు ప్రయోజనం కల్పిస్తోంది.

# కొరియన్ పెట్టుబడులకు ఏపీ స్వాగతం

నిలుస్తాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో తూర్పుతీరంలో సురక్షితమైన, నమ్మకమైన, స్నేహపూర్వక ప్రత్యామ్నాయంగా ఆంధ్రప్రదేశ్ నిలుస్తుందన్నారు. దీనివల్ల ప్రపంచ సప్లయ్ చైన్ నష్టాలను కూడా తగ్గించడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. కేవలం భారీ పరిశ్రమలేకాకుండా గ్రీన్ ఎనర్జీ, వినియోగ వస్తువులు, మోడరన్ రిటైల్, టూరిజం, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కొరియన్ పెట్టుబడులకు ఏపీ స్వాగతం పలుకుతోందన్నారు.

# తనిఖీ చేసిన ఏపీ పోలీసులు

బృందం పాల్గొంది. కొన్ని దస్త్రాలు, రికార్డులు స్వాధీనం చేసుకుంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని నరేంద్రనగర్ కాలనీలో గత రెండేళ్లుగా రావణ్ ఉంటున్నట్లు సమాచారం. ఇంట్లోకి ప్రవేశించినప్పటి నుంచి ప్రతి అంశాన్ని వీడియో రికార్డు చేశారు. రావణ్ భార్యను ప్రశ్నించి పలు వివరాలు సేకరించినట్లు తెలిసింది. వివరాలు నమోదు చేసి ఆమె సంతకాలు తీసుకున్నారు. స్థానిక విలేకరులతో పాటు ఎవరినీ అనుమతించలేదు. అమీన్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అమీన్‌పూర్ డీఐ సత్యనారాయణ, ఎస్సై విజయరావుతో పాటు కొంత మంది పోలీసులు వారికి సహకరించారు. తాము కేవలం బందోబస్తు మాత్రమే నిర్వహించామని పూర్తి వివరాలు తెలియవని స్థానిక పోలీసులు తెలిపారు.

### కాకినాడ జిల్లా తొండంగి వద్ద

# సముద్రంలో ప్రమాదం

గాయపడ్డారు. వీరు మరికొంతమందితో కలిసి సముద్రంలో సుమారు 15 కిలోమీటర్ల దూరం వరకు చేపల వేటకు వెళ్లారు. అక్కడ భోజనం వండుకునేందుకు బోటులో గ్యాస్ స్టవ్ ఆన్ చేయగా, ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా మంటలు చెలరేగి పడవ మొత్తానికి వ్యాపించాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు మత్స్యకారులంతా సముద్రంలోకి దూకేశారు. సమీపంలోనే వేరే బోటులో ఉన్న తోటి మత్స్యకారులు దీనిని గమనించి, హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని అందరినీ రక్షించారు. తీవ్రంగా గాయపడిన కోటేశ్, ప్రసాద్‌లను వెంటనే తునిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇప్పటికే ఒక బోటు ప్రమాదాల్లో ఆరుగురు మత్స్యకారులు గల్లంతు కాగా.. మరో బోటు ప్రమాదంలో 10 మందిని సురక్షితంగా కాపాడిన సంగతి తెలిసిందే.

# దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

తప్పించడం లేదు. సిబ్బందికి పూర్తి ఉద్యోగ భద్రత ఉంటుంది. సంస్థ ఆస్తులు విక్రయించడం, లీజుకు ఇవ్వడం వంటివి చేయడం లేదు. ఆర్టీసీ సిబ్బంది జీతాలు, స్త్రీశక్తి, దివ్యాంగ శక్తి పథకాల భారాన్ని ప్రభుత్వమే భరిస్తుంది" అని కృష్ణబాబు వివరించారు.

# మిలటరీ స్థావరాలపై ఇరాన్ దాడి

విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో గురువారం జోర్డాన్‌పై 10 బాలిస్టిక్ క్షిపణులు ప్రయోగించినట్లు టెహ్రాన్ వెల్లడించింది. ఈ దాడుల్లో అమెరికా కమాండ్ కంట్రోల్ సెంటర్‌తోపాటు శత్రుదేశానికి చెందిన ఎయిర్ బేస్ నాశనమైందని పేర్కొంది. ఇదే పరిస్థితి కొనసాగితే... పశ్చిమాసియాలో ఆ దేశానికి చెందిన ఏ స్థావరమూ సురక్షితం కాదని, ప్రతి దాడులు తప్పవని హెచ్చరించింది. అయితే, ఈ ప్రకటనను జోర్డాన్ ఖండించింది. తమ రక్షణవ్యవస్థ 8 క్షిపణులను కూల్చివేసిందని స్పష్టం చేసింది. అయితే ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపింది. నిబంధనలను అతిక్రమించి జోర్డాన్ గగనతలంలోకి ఎవరైనా ప్రవేశిస్తే తీవ్రంగా బదులిస్తామని హెచ్చరించింది. ఇరాన్‌పై అమెరికా దాడులకు ప్రతిచర్యగా జోర్డాన్‌లోని అమెరికన్ కమాండ్ సెంటర్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు జూన్ 11న రివల్యూషనరీ గార్డ్ ప్రకటించింది. ఆ తర్వాత ఇరాన్ క్షిపణులను తాము అడ్డుకున్నట్లు జోర్డాన్ ప్రకటించడం ఇదే తొలిసారి.

# మరోసారి పశ్చిమాసియాలో టెన్షన్..

ఇండియా-ఆస్ట్రేలియా సీఈఓ ఫోరమ్‌లో ప్రసంగించారు. వాణిజ్యం, రక్షణ, విద్య సహా పలు అంశాలపై ఆల్బనీస్‌తో చర్చించారు. అలాగే స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కీలకమైన అణుశక్తి ఒప్పందంపై సంతకాలు చేశారు. భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరా చేస్తుందని మోదీ వెల్లడించారు. క్రిటికల్ మినరల్ కారిడార్, డిఫెన్స్ ఇన్నోవేషన్ కారిడార్ ఏర్పాటుకు ప్రణాళికలను ప్రకటించారు. ఇండో-పసిఫిక్‌లో శాంతి, సుస్థిరత, స్వేచ్ఛా నౌకాయానంపై కలిసి అడుగులు వేస్తామని తెలిపారు. తాజా పర్యటన ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**క్రికెట్ పోలిక తెచ్చిన మోదీ..**

భారత్, ఆస్ట్రేలియా ప్రజలకు ఎంతో ఇష్టమైన ఆట క్రికెట్. అందుకే ఈ రెండు దేశాల మధ్య చర్చలు జరిగినప్పుడల్లా క్రికెట్ ప్రస్తావన వస్తూనే ఉంటుంది. తాజాగా కుదిరిన యురేనియం డీల్ నేపథ్యంలో ఆ భాషలోనే మన ప్రధాని మాట్లాడారు. "ప్రపంచ క్రీడా రాజధాని అయిన మెల్‌బోర్న్‌లో మనం ఈ రోజు ఉన్నాం. ఇక్కడ ఆ క్రీడల గురించి మాట్లాడకపోవడం అంటే.. టాస్ వేసిన తర్వాత కూడా క్రికెట్ మ్యాచ్ ప్రారంభం కాకపోవడమే అవుతుంది. ఈ రెండు దేశాల సంబంధాలకు ఇదొక ప్రత్యేక దౌత్యపరమైన భాష. మన సమావేశాలు క్రికెట్ మ్యాచ్‌ల్లానే ఉంటాయి. అజెండా వన్డే మ్యాచ్‌లా, నిర్ణయాలు టీ20 అంత వేగంగా, భాగస్వామ్యం టెస్ట్ మ్యాచ్ అంత సుదీర్ఘంగా, గాఢంగా ఉంటుంది" అని మోదీ తెలిపిన వర్ణనకు ఆడియన్స్ చప్పట్లతో స్పందించారు. యురేనియం డీల్ కుదిరిన నేపథ్యంలో ఆయన ఈ విధంగా మాట్లాడారు.

# హైదరాబాద్‌లో 'ఒలింపిక్స్' నా డ్రీమ్

ఆతిథ్యం ఇస్తున్నాం. చదువుకుంటే ఉద్యోగం వస్తుందో లేదో తెలియదు.. ఆటలు ఆడితే మాత్రం కచ్చితంగా వస్తుంది. ఒలింపిక్స్ పతకాల్లో భారత్ ఎప్పుడూ చివరనే ఉంటోంది. కొంతమంది ఒలింపిక్స్, ఇతర గేమ్స్‌లో రాణించినా దేశానికి సరైన గుర్తింపు రావట్లేదు. ప్రభుత్వ విధానాలే ఈ దుస్థితికి కారణం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

# రాజకీయంగా వెంటాడుతా

పోరాటం చేస్తే.. నీ కులం నీకు అండగా రావాలా? నీ రాజకీయ ఉనికి ప్రమాదంలో పడితే సామాజిక వర్గం ఏకం కావాలంటున్నావు. అసత్య ఆరోపణలతో నా ఆత్మగౌరవానికి, పరువుకు భంగం కలిగించావు. నీ మాదిరిగా దందాలు, బెదిరింపులు, భూకబ్జాలు చేశానా?నీ ఆస్తుల ఖరీదెంత? నా ఆస్తుల ఖరీదెంత? చర్చిద్దామా? నాకు 4 పదవులు ఉన్నాయని హేళనగా మాట్లాడావు. ఆ పదవుల కాలపరిమితి తర్వాత ముగియవచ్చు. కానీ నాకు ఉన్న ఐదో పదవి తెదేపా కార్యకర్త. ప్రాణం ఉన్నంత వరకు పసుపు జెండా మోసే సైనికుడినే. మనిద్దరికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. ప్రాణం ఉన్నంత వరకు రాజకీయంగా వెంటాడుతా. నా ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన నిన్ను వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని ఎం.ఎస్. రాజు హెచ్చరించారు.

**వివాదానికి నేపథ్యమిదీ..**

ఈనెల 2న శింగనమల మండలంలోని సి.బండమీదపల్లి వద్ద ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రా కంపెనీ టిప్పర్ క్రషర్‌కు వెళ్లే క్రమంలో యూటర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో వైకాపా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కారు వేగంగా ఎదురు వచ్చింది. టిప్పర్ డ్రైవర్ అప్రమత్తమై వాహనం ఆపడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనను వైకాపా నేత రాజకీయం చేశారు. తనను హత్య చేసేందుకు ఎమ్మెల్యేలు సురేంద్రబాబు, పరిటాల సునీత, మంత్రి నారా లోకేశ్ కుట్ర పన్నారంటూ రాద్ధాంతం చేశారు. పరిటాల రవీంద్ర ప్రస్తావన తీసుకొస్తూ సునీతను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాట్లాడిన ఎం.ఎస్. రాజును కూడా తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి లక్ష్యంగా చేసుకుని అక్రమాస్తుల ఆరోపణలు చేశారు. అప్పటినుంచి వీరిద్దరి మధ్య మాటల యుద్ధం జరుగుతూ గురువారం ఉద్రిక్తతకు దారితీసింది.

# తిరుమలలో భారీ సర్పం

స్థానికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. దీనిపై సమాచారం అందుకున్న టీటీడీ అధికారులు వెంటనే స్పందించారు. వన్యప్రాణులను పట్టుకోవడంలో నైపుణ్యం కలిగిన టీటీడీ ఉద్యోగి భాస్కర్ నాయుడు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆయన పామును పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో, అది అనూహ్యంగా ఆయన కాలికి చుట్టుకోవడంతో అక్కడున్న వారు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. అయితే, భాస్కర్ నాయుడు ఏమాత్రం అధైర్యపడకుండా ఎంతో చాకచక్యంగా వ్యవహరించి, ఆ పాము నుంచి విడిపించుకోవడమే కాకుండా దానిని బంధించారు. అనంతరం ఆ పామును సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. తిరుమల క్షేత్రం శేషాచలం అటవీ ప్రాంతం మధ్యలో ఉండటం వల్ల అప్పుడప్పుడు వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తుంటాయని, భక్తుల రక్షణ విషయంలో టీటీడీ యంత్రాంగం ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటుందని అధికారులు తెలిపారు.

# రికార్డు సృష్టించాం

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్గదర్శకత్వంలో ధాన్యం కొనుగోలులో వినూత్న సంస్కరణలు తెచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రెండో ఏడాదిలో ఏకంగా 74 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించి రికార్డు సృష్టించిందన్నారు. రూ. 31 వేల కోట్ల విలువైన ధాన్యానికి సంబంధించి, 11.53 లక్షల మంది రైతులకు 95 శాతం చెల్లింపులను 24 గంటల్లోనే పూర్తి చేశామని తెలిపారు. ఏపీ తెచ్చిన '10 శాతం బ్రోకెన్ రైస్' విధానాన్ని కేంద్రం కూడా గుర్తించి దేశవ్యాప్తంగా అమలు చేయనుందని చెప్పారు. క్యూఆర్ కోడ్, వాట్సాప్ బుకింగ్, మాయిశ్చర్ మీటర్ల ద్వారా కొనుగోళ్లలో పారదర్శకత పెంచామని, రానున్న సీజన్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేలా రైతులను సన్నద్ధం చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

# కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రతిష్మాత్మక 'బందరు పోర్టు' పనులను మరింత వేగవంతం చేసి, వచ్చే ఏడాది ఆరంభంలోనే ప్రారంభిస్తామని మంత్రి ప్రకటించారు. దీని ద్వారా మచిలీపట్నం పారిశ్రామికంగా ఎదిగి, స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి అవకాశాలు లభిస్తాయని కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు.

# మేము నారా లోకేష్ అనుమతి తీసుకోవాలా?

ఏకంగా 14 కుట్లు పడేలా తీవ్ర గాయమైందని, అంత జరిగినా పోలీసులు ఎందుకు కేసు పెట్టడం లేదని అంబటి ప్రశ్నించారు. అక్కడ రాయి విసిరిన వ్యక్తి పేరు 'కిరణ్' అనే విషయం పోలీసులకు స్పష్టంగా తెలిసినప్పటికీ... నిందితుడిని ఇప్పటివరకు గుర్తించలేదంటూ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఉండవల్లిలో తమ పార్టీ శ్రేణులపైనే ప్రత్యర్థులు దాడికి తెగబడ్డారని, కానీ పోలీసులు మాత్రం అన్యాయంగా తమపైనే రివర్స్ కేసులు పెట్టారని అంబటి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులే స్వయంగా నిబంధనలను ఉల్లంఘిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం ఇవ్వడానికి కూడా తాము మంత్రి నారా లోకేశ్ అనుమతి తీసుకోవాలా? అని అంబటి నిలదీశారు. ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకుని వెళ్లినా ఎస్పీ అందుబాటులో లేకుండా పోయారని.. చివరకు ఏఎస్పీకి వినతిపత్రం ఇవ్వాలని పోలీసులు సూచించారని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీలో మరో కూటమి.. చర్చలు షురూ!?

ప్రత్యేకంగా కొత్త కూటమి కట్టే విషయంలో కమ్యూనిస్టులు చొరవ చూపిస్తున్నారు. రాష్ట్ర విభజన కు ముందు... కమ్యూనిస్టులకు కొన్ని నియోజకవర్గాల్లో ప్రాబల్యం ఉంది.

ఏపీలో మరో కూటమి అవతరించనుందా? వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం ఉన్న కూటమికి పోటీగా ఇది మారనుందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. 2024 ఎన్నికల సమయంలో కూటమి కట్టిన టీడీపీ, బీజేపీ, జనసేనలు ఐక్యంగా ముందుకు సాగుతున్నాయి. పైగా వచ్చే ఎన్నికల్లోనూ అంతే బలంగా ముందుకు సాగాలని కూటమి నిర్ణయించుకుంది. దీంతో ప్రస్తుతం ఉన్న కూటమి యేతర పార్టీలు ఒంటరి పోరాటం కంటే కలిసి నడిస్తేనే బెటర్ అన్న ఆలోచనకు వచ్చినట్టు గత కొన్నాళ్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

### కమ్యూనిస్టుల చొరవ

ప్రత్యేకంగా కొత్త కూటమి కట్టే విషయంలో కమ్యూనిస్టులు చొరవ చూపిస్తున్నారు. రాష్ట్ర విభజన కు ముందు... కమ్యూనిస్టులకు కొన్ని నియోజకవర్గాల్లో ప్రాబల్యం ఉంది. అయితే.. విభజన తర్వాత.. తెలంగాణలో పట్టు నిలుపుకొన్నప్పటికీ.. ఏపీలో కోల్పోయారు. సీపీఐ, సీపీఎంలు ఇప్పటి వరకు జరిగిన 2014, 2019, 2024 ఎన్నికల్లో పోటీ చేయడమే తప్ప.. గెలిచిందే లేదు. 2019లో జనసేనతో పొత్తు పెట్టుకున్నా.. ఫలితం దక్క లేదు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు రెండేళ్ల ముందే కూటమి కట్టే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

కలిసొచ్చే పార్టీలను కమ్యూనిస్టులు రహస్యంగా కలుస్తున్నారని తెలుస్తోంది. ప్రధానంగా వైసీపీ నేతలను ఓ కీలక కమ్యూనిస్టు, రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సీనియర్ నాయకుడు కలిశారని.. పొత్తు పెట్టుకు ని ముందుకు వెళ్దామని ఆయన సూచించినట్టు వైసీపీ వర్గాల్లోనూ చర్చ జరుగుతోంది. జగన్‌కు సన్నిహితుడై న సదరు నేత సూచనలను వైసీపీ కూడా పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న కూటమిని చీల్చే ప్రయత్నం చేసినా.. అది ఫలించలేదు.

ఈ నేపథ్యంలో తాము కూడా ఓ కూటమిగా ముందుకు వెళ్లేందుకు జగన్ కూడా సుముఖంగానే ఉన్నారని వైసీపీ నాయకులు తరచుగా చెబుతున్నారు. "ఒంటరి ప్రయాణం మంచిదే. అయితే..కూటమిగా వెళ్తే మరింత తేలికగా.. విజయం దక్కించుకోవచ్చు" అని కృష్ణా జిల్లా కు చెందిన మాజీ మంత్రి ఒకరు వ్యాఖ్యానించారు. ఇక, ఈ కూటమిలో కాంగ్రెస్ కూడా ఉంటుందన్న టాక్ వస్తోంది.

అయితే.. కాంగ్రెస్ పార్టీ ఈ కూటమిలో ఉంటే వైసీపీ ఉండదని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. ఇక, చిన్న చితకా పార్టీలు.. కూడా చేతులుకలిపి కొత్త కూటమి ఏర్పాటుకు ముందుకు వస్తున్నాయన్నది రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ. మరి ఏం జరగుతుంది? ఈ కూటమి ఏర్పడుతుందా? లేదా? అనేది కొన్నాళ్లు వెయిట్ చేసి చూడాల్సిందే.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## శంషాబాద్‌లో బొలెరో వాహనం బీభత్సం : ఇద్దరి మృతి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధి శాతంరాయి వద్ద బెంగళూరు హైవేపై బొలెరో వాహనం బీభత్సం సృష్టించింది. రోడ్డుపక్కన బస్సు కోసం నిల్చున్న వారిపైకి బొలెరో దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. బీన్స్ లోడుతో శంషాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తోన్న బొలెరో వాహనం శాతంరాయి వద్దకు రాగానే బస్సును ఓవర్ టెక్ చేస్తున్న క్రమంలో అదుపుతప్పి బోల్తా పడింది. బోల్తా కొట్టిన ప్రదేశంలో ఆర్టీసీ బస్ స్టాప్ ఉండడంతో బస్సు కోసం వేచి ఉన్న జనాలపై పడింది. ఈ ప్రమాదంలో శాతంరాయికి చెందిన సుమ, సువర్ణ ఘటనా స్థలిలోనే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లి.. ఇంట్లోని వస్తువులకు నిప్పుపెట్టి..

## గుంతకల్లులో భారీ చోరీ



**గుంతకల్లు, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా గుంతకల్లులో భారీ చోరీ జరిగింది. తాళం వేసిన ఇంటి నుంచి 30 తులాల బంగారం, 50 తులాల వెండి, రూ.20వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. అనంతరం ఇంట్లోని వస్తువులు, దుస్తులను కాల్చేశారు. దీంతో బాధితురాలు ఉమాదేవి కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మిలిటరీ కాలనీ ఏబీ ఫంక్షన్ హాల్ దగ్గర కొయినగర్‌లో ఉమాదేవి ఇల్లు నిర్మించుకుని అందులో నివాసముంటున్నారు. ఆమె గుంతకల్లు రైల్వేస్టేషన్‌లోని సిగ్నల్ విభాగంలో పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి 9 గంటలకు ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. వేకువజామున దుండగులు వచ్చి ఇంటి తాళాలు పగులగొట్టారు. బెడ్‌రూమ్‌లోని బీరువా నుంచి బంగారం, వెండి ఆభరణాలను చోరీ చేశారు. అనంతరం దుస్తులు, వస్తువులను కింద వేసి కాల్చి వెళ్లిపోయారు. వేకువజామున ఇంటి నుంచి పొగ వస్తుండటంతో స్థానికులు గమనించి ఉమాదేవికి సమాచారం ఇచ్చారు. ఉదయం ఇంటికి రాగానే తలుపులు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించారు. ఇంట్లోని టీవీ, మంచం, ఇతర వస్తువులు కాలిపోవడంతో పొగలు వచ్చాయి. అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్ అశ్వర్థ, సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. వంటగదిలో ఉన్న గ్యాస్ సిలిండర్లను బయటకు తెచ్చిపెట్టారు. గుంతకల్లు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై వెంకటస్వామి ఇంటిని పరిశీలించారు. క్లూస్‌టీమ్ చేరుకుని వేలిముద్రలను సేకరించింది. తనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని.. సోలాపూర్‌లో చదువుకుంటున్నారని ఉమాదేవి చెప్పారు. వారి పెళ్లిళ్ల కోసం బంగారు, వెండి ఆభరణాలు కొనుగోలు చేసి పెట్టుకున్నామన్నారు. సర్వం కోల్పోయానని.. యూనిఫామ్ ఒక్కటే మిగిలిందని ఆమె కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేధిస్తున్నాడని కుమారుడిని కడతేర్చిన తండ్రి



**కోవెలకుంట్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ తండ్రి క్షణికావేశం కన్నకొడుకును కడతేర్చింది. మానసిక పరిస్థితి సరిగ్గా లేని కుమారుడు నిత్యం వేధిస్తుండటంతో ఆందోళనకు గురైన తండ్రి కట్టెతో కొట్టి చంపాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం కంపమల్లలో బుధవారం జరిగింది. ఎస్సై మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వసుంధరరావు, లీలావతి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. పెద్దవాడైన వంశీకృష్ణ(22) బెంగళూరులో బీసీఏ చదివి, ఆరు నెలలుగా ఇంటివద్దే ఉంటున్నాడు. అతడి మానసిక పరిస్థితి సరిగ్గా లేక ఇంట్లో గొడవపడుతూ తల్లిదండ్రులను వేధించేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి తల్లిని కొట్టి ఇంట్లోని వస్తువులను పగలగొట్టి భయభ్రాంతులకు గురిచేశాడు. వంశీకృష్ణ బతికుంటే తమను చంపుతాడేమోనని భయపడిన తండ్రి.. అతడి తలపై కట్టెతో కొట్టి చంపాడని ఎస్సై తెలిపారు. ఈ ఘటనపై వంశీకృష్ణ తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## రూ.4.7 కోట్లు దోచేసిన.. బాస్‌స్కామ్ కేసులో ఇద్దరి అరెస్టు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రియల్ ఎస్టేట్ సంస్థ ఎండీ ఫొటో వాట్సప్ డీపీగా పెట్టి సంస్థ ఉద్యోగిని నమ్మించి రాజధానిలో ఇటీవల రూ.4.7 కోట్లు కొట్టేసిన 'బాస్‌స్కామ్' కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో సంచాలకులు శిఖాగోయల్ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు రూ.1.80 కోట్లు ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్ కొత్తపేటలో ఉంటున్న మండవల్లి శివ నాగరాజు ఖాతాలో జమైనట్లు గుర్తించారు. సత్తుపల్లికే చెందిన దోసపాటి కృష్ణసాయి సైబర్ నేరగాళ్లతో కుమ్మక్కై ఈ ఖాతాను వారికి సమకూర్చినట్లు బయటపడింది. శివనాగరాజు ఖాతాలో మరో రూ.2.49 కోట్లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఇది కూడా అనుమానాస్పద డబ్బుగానే భావిస్తున్నారు. కృష్ణసాయి ఉద్దేశపూర్వకంగానే ఈ ఖాతాను సైబర్ నేరగాళ్లకు సమకూర్చినట్లు, ఇందుకు ఇద్దరు నిందితులు రూ.4 లక్షలు కమీషన్ రూపంలో అందుకున్నట్లు గుర్తించారు.

## కర్ణాటకలో ఘోర ప్రమాదం..

### ఆరుగురి దుర్మరణం

**చిత్రదుర్గం, విశ్వం వాయిస్ న్యూస్ :** కర్ణాటకలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ధార్వాడ నుంచి గురువారం తెల్లవారుజామున 9 మంది పర్యాటకులు వాహనంలో అంకోలా బయల్దేరారు. ఉత్తర కర్ణాటక జిల్లా ఎల్లాపుర పట్టణ శివారులోకి రాగానే వారు ప్రయాణిస్తున్న జీపు అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం చెందారు. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### బాలిక తండ్రి హింసించాడు..

## అందుకే చిన్నారిని చంపేశా..

**విశ్వం వాయిస్ న్యూస్ :** అస్సాంలో ఎనిమిదేళ్ల చిన్నారి హత్య ఉదంతం కలకలం రేపింది. శ్రీభూమి జిల్లా మదన్‌మోహన్ ప్రాంతానికి చెందిన చిన్నారి బుధవారం ఆడుకునేందుకు బయటకు వెళ్లగా.. అదే ప్రాంతానికి చెందిన బాలుడు అడవిలోకి తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. పోస్టుమార్టం నివేదికలో విషయం తేలుతుందని పోలీసులు పేర్కొన్నారు. చిన్నారి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలిస్తుండగా.. నిందితుడు కూడా వారితో కలిసి వెతికినట్లు నటించాడని జిల్లా అదనపు ఎస్పీ త్రిభువన్ భుయాన్ తెలిపారు. ఓ సందర్భంలో నిందితుడు పరారీకి యత్నించాడని, పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారని చెప్పారు. హత్య చేసినట్లు అంగీకరించినప్పటికీ.. అత్యాచారం ఆరోపణలను మాత్రం తోసిపుచ్చినట్లు వెల్లడించారు. నిందితుడిపై పోక్సో సహా పలు సెక్షన కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. చిన్నారి తండ్రి గతంలో బాలుడిపై చేయి చేసుకున్నాడని, ఆ కోపంతోనే ఈ దారుణానికి పాల్పడినట్లు నిందితుడు పోలీసులకు వెల్లడించినట్లు సమాచారం. నిందితుడు మైనర్ కావడంతో వయసును కూడా ధ్రువీకరించనున్నారు. చిన్నారి హత్యపై ఆగ్రహించిన స్థానికులు పోలీసులు అదుపులోకి తీసుకునే ముందు నిందితుడికి దేహశుద్ధి చేశారు. పెద్దఎత్తున రోడ్డెక్కి నిరసన చేపట్టారు. నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు.

## సాయం కోరినవారే..ఎడారిలో పూడ్చిపెట్టారు

### పొక్లెయిన్ మరమ్మతు చేస్తూ యువకుడి దుర్మరణం

### కువైట్‌లో దారుణం.. మృతుడిది నిజామాబాద్ జిల్లా



**డిచ్‌పల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** సాయం చేద్దామని వెళ్లిన యువకుడు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. ఈ విషయం బయటికి తెలిస్తే జైలు పాలవుతామనే భయంతో సాయం కోరినవారే మృతదేహాన్ని ఎడారిలో పూడ్చిపెట్టారు. కువైట్‌లో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. డిచ్‌పల్లి ఎస్సై ఆరీఫ్, తండా వాసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లి తండాకు చెందిన కైలాష్ (29) కువైట్‌లోని అల్‌సల్మిలో మెకానికల్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇదే మండలంలోని ఓ తండాకు చెందిన తండ్రీకొడుకులు సైతం అక్కడే పనిచేస్తుండగా.. వారికి పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది మార్చి 19న ఆ తండ్రీకొడుకులు ఉన్నచోట పొక్లెయిన్ చెడిపోవడంతో బాగు చేయడానికి కైలాష్‌ని తీసుకెళ్లారు. మరమ్మతులు చేస్తుండగా.. ఆకస్మికంగా జరిగిన ప్రమాదంలో కైలాష్ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. తమ కారణంగానే ఇలా జరిగిందనే భయంతో వారిద్దరూ కైలాష్ మృతదేహాన్ని అక్కడి ఎడారిలో పూడ్చిపెట్టారు. కైలాష్ కనిపించకపోవడంతో అక్కడే ఉన్న బంధువులు ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు కువైట్‌లో యుద్ధ వాతావరణం కారణంగా దర్యాప్తులో జాప్యం జరిగింది. ఇటీవల సీసీ ఫుటేజీల ఆధారంగా విచారణ చేసిన పోలీసులు నిందితుల్లో ఒకరిని పట్టుకోవడంతో దారుణం వెలుగులోకి వచ్చింది. బుధవారం కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియడంతో తమకు న్యాయం చేయాలని మృతుడి కుటుంబీకులు తండావాసులతో పోలీసుస్టేషన్‌కు తరలివచ్చారు. మృతదేహం పూడ్చిపెట్టిన నిందితుల్లో ఒకరైన గణేశ్ ఇక్కడికే వచ్చి ఉంటున్నాడని.. చర్యలు తీసుకోవాలని కైలాష్ తండ్రి గంగారాం ఫిర్యాదు చేశారని ఎస్సై చెప్పారు. నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.





కాకినాడ జిల్లా



తూర్పు గోదావరి జిల్లా



డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా





# కులవివక్ష లేని సమాజం కోసం కదిలిరండి

## రాష్ట్ర నాయకులు డి.రమాదేవి, బి.బలరాం, దడల సుబ్బారావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఈ రోజు అమలాపురంలో జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర నాయకులు డి.రమాదేవి, బి.బలరాం, దడల సుబ్బారావు హాజరై, సామాజిక శంఖారావం కరపత్రాన్ని విడుదల చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు డి.రమాదేవి, బి.బలరాం, దడల సుబ్బారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా దేశంలో, రాష్ట్రంలో కుల వివక్ష, అంటరానితనం రూపాంతరం చెంది నేటికీ కొనసాగడం అత్యంత విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, నారాయణ గురు, పెరియార్ రామస్వామి, గుర్రం జాషువా, పుచ్చలపల్లి సుందరయ్య వంటి మహనీయులు కులవివక్ష లేని సమసమాజ స్థాపన కోసం నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. కానీ నేడు పల్లెల్లో దళిత వాడలు ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయని, అంటరానితనం వేర్వేరు రూపాల్లో కోరలు చాస్తోందని మండిపడ్డారు. "రాష్ట్రంలో దళితులు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల సమస్యలను పరిశీలించడానికి కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజా సంఘాల కార్యకర్తలు అధ్యయన యాత్రలు చేస్తున్నారు. దళితుల స్మశాన వాటికల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన జీవో 1235ను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి. అలాగే జస్టిస్ పున్నయ్య కమిషన్, కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సులను తక్షణమే అమలు చేసి, భూమి లేని ప్రతి దళిత కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలి. దళిత మహిళలపై జరుగుతున్న దాడులను, అపహాస్యపు మాటలను అరికట్టాలి." అనిడిమాండ్ చేశారు. దళిత అనేది కేవలం ఒక కులానికి సంబంధించినది కాదని, అది ఒక సామాజిక సమస్య అని వారు స్పష్టం చేశారు. సామాజిక న్యాయాన్ని, అభివృద్ధిని కాంక్షించే ప్రతి ఒక్కరూ, వారు ఏ కులమైనా సరే ఈ సామాజిక శంఖారావం ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**సదస్సు ద్వారా ప్రభుత్వం ముందుంచిన ప్రధాన డిమాండ్లు:**

దళితుల స్మశాన సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన జీవో 1235ను తక్షణమే అమలు చేయాలి.

జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను సంపూర్ణంగా అమలు చేయాలి.

కోనేరు రంగారావు కమిషన్ సిఫార్సుల ప్రకారం భూమి లేని ప్రతి కుటుంబానికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలి.

కులంతర వివాహాల రక్షణ చట్టం తీసుకురావాలి. మతం పేరుతో వేధింపులు ఆపాలి.

ఎస్సీ, ఎస్టీ అత్యాచార కేసుల్లో పోలీసుల నిర్లక్ష్యాన్ని వీడి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

దళిత పేటల్లో మూసివేసిన ప్రాథమిక పాఠశాలలను పునరుద్ధరించాలి.

ధరల పెరుగుదలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పెంచాలి. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఇంబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి.

దళిత మహిళలను కించపరుస్తూ మాట్లాడే అహంకార భాషను, దాడులను అరికట్టాలి.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు ఇవ్వాలి.

బ్యాక్‌లాగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీ సర్కిల్స్ పునరుద్ధరించాలి.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలి.

ఈ సమస్యల పరిష్కారం కోసం ప్రజలందరినీ కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని, ఈ నెలలో జరగబోయే సామాజిక శంఖారావం బృందాల యాత్రలకు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున సహకరించి జయప్రదం చేయాలని రాష్ట్ర నాయకులు కోరారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు ఐ. మంగాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్, కార్యదర్శి ఎన్. బలరాం, టీ. నాగవరలక్ష్మి, ఎజజూం జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు, నిమ్మకాయలు వెంకటేష్, ఐద్వా జిల్లా అధ్యక్షులు రాలు జి దైవ కృప, సుశీల కవులు రైతు సంఘా బుంగ సత్యనారాయణ,గోపాలన్ పాము బాలయ్య, అంగన్వాడీ జిల్లా కోశాధికారి పి.అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

### పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ద్వారా

# సాగునీరు విడుదల



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం పురుషోత్తపట్నం పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు సాగు నీటిని విడుదల చేసే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కాకినాడ జిల్లా టిడిపి ఇన్చార్జ్ జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ మాట్లాడుతూ రాజాన గరంనియోజకవర్గంలో వ్యవ సాయాన్ని లాభసాటిగా మారుస్తామని, అన్నదాతల ముఖాల్లో ఆనందం చూసే వరకు విశ్రమించనని అన్నారు. రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చినందున ప్రతి ఒక్కరు నీటిని పొదుపుగా సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ప్రభుత్వ సహకారంతో ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయని రైతులకు సాగునీరు అందించడం తన రాజకీయ జీవితంలో మర్చిపోలేని సంఘటనని పేర్కొన్నారు .నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మరియు ప్రభుత్వ సహకారంతో పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

### ఆటో కార్మికుల విశ్రాంతి నిలయాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ఆటో కార్మిక రంగంలో పని చేసే కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద నూతనంగా నిర్మించిన "ఆటో కార్మికుల విశ్రాంతి నిలయం" ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ ఎండనక, వాననక ప్రజలను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చే ఆటో కార్మికుల సేవలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. నిత్యం శ్రమించే ఆటో డ్రైవర్లు కాసేపు ప్రశాంతంగా విశ్రాంతి తీసుకోవడానికి, ఎండ, వానల నుండి రక్షణ పొందేందుకు ఈ విశ్రాంతి నిలయం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ చిరకాల కోరికను గుర్తించి, విశ్రాంతి నిలయాన్ని అందుబాటులోకి తెచ్చినందుకు ఆటో కార్మిక సంఘాల ప్రతినిధులు, డ్రైవర్లు ఎమ్మెల్యే వేగుళ్ళ కు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆటో కార్మికులు ఎమ్మెల్యేను దుశ్శాలువాతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ ఆటో కార్మిక సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

### సహకార సంఘాలు గ్రామీణ

# ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక

**కోలంకలో రూ.66 లక్షలతో పి.ఏ.సి.ఎస్ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన**



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం కోలంక గ్రామంలో రూ.66 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పి.ఏ.సి.ఎస్) నూతన భవన నిర్మాణానికి ఈరోజు ఘనంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, జనసేన కాజులూరు మండల అధ్యక్షుడు బొండా వెంకన్న, బొండా వీర వెంకట నరసింహనాయుడు, కోలంక సొసైటీ అధ్యక్షులు, కూటమి నాయకులు పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, రైతులకు సేవలందించే సహకార సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటివని అన్నారు. రైతులు తమ పంటల సాగు, రుణ సదుపాయాలు, ఎరువులు, విత్తనాలు మరియు ఇతర అవసరాల కోసం ఆశ్రయించే ఈ సొసైటీ భవనం రైతులకు ఒక దేవాలయం వంటిదని పేర్కొన్నారు. కోలంక, పెద్దలంక, నామవానిపాలెం గ్రామాల రైతులు మరియు సొసైటీ సభ్యులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో ఈ నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. రైతులు ఇబ్బందులు లేకుండా తమ అవసరాలను తీర్చుకునేలా భవన నిర్మాణ పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, సహకార వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. సహకార సంఘాల అభివృద్ధి ద్వారా రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతు కుటుంబాలు అభివృద్ధి చెందితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, గ్రామాల అభివృద్ధితో రాష్ట్రం మరింత పురోగతి సాధిస్తుందని అన్నారు. అలాగే కోలంక సొసైటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి అవసరమైన ప్రతి అంశంలో తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ గారు,తూర్పు డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, ఏ ఎం సి చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, కాజులూరు మండల జనసేన పార్టీ అధ్యక్షులు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షులు బొండా వెంకట నరసింహ నాయుడు, సొసైటీ అధ్యక్షులు యళ్ళ వెంకటరమణ, కొల్లు వెంకటేశ్వరావు, విల్లా వీర, కోట తాతఅబ్బాయి,యాళ్ళ తనిబాబు, లకాని కృష్ణ చైతన్య, గోపాల్ రాజు,చౌదరి కూటమి నాయకులు యళ్ళ కృష్ణారావు, కొప్పిశెట్టి స్వామినాదు, వెలుగుబంట్ల శ్రీరామచంద్రమూర్తి, సలాది నానాజీ, నల్లకుల సత్తిబాబు, కోలంక, పెద్దలంక, నామవానిపాలెం గ్రామాల రైతులు, సొసైటీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### రావులపాలెం మాజీ ఉప సర్పంచ్

# మునిరెడ్డి మృతి



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం మాజీ ఉపసర్పంచ్ ముని రెడ్డి మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి ఆయన అంతిమయాత్ర భారీ సంఖ్యలో గ్రామస్తులు వైసీపీ నాయకులు అభిమానులు పంచాయతీ సిబ్బంది హాజరై కన్నీరు మున్నీరయ్యారు జిల్లా వైసీపీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పాడే మోసి ముని రెడ్డికి నివాళులర్పించారు ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ పలువురు నాయకులు అభిమానులు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు.

### శనివారం అమలాపురంలో


# విద్యుత్ అంతరాయం

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని 11 కేవీ పోస్టల్ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఫీడర్ల పరిధిలో ట్రీ కట్టింగ్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో జూలై 11 (శనివారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అమలాపురం విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే.రాంబాబు తెలిపారు. విద్యుత్ అంతరాయం ప్రభావిత ప్రాంతాల్లో పోస్టల్ కాలనీ, కామాక్షి పీఠం రోడ్, దక్షిణామూర్తి వీధి, ప్రకాశం వీధి, భూపయ్య అగ్రహారం, కాలేజ్ రోడ్, అప్పారివారిపాలెం, తారకరామా నగర్, పళ్ళ వెంకట్రావు స్ట్రీట్, దుద్దువారి అగ్రహారం, గణికమ్మ గుడి పరిసరాలు, కాపు కళ్యాణ మండపం నుంచి నల్లవంతెన వరకు మెయిన్ రోడ్డు, వేపచెట్టు దుర్గమ్మ గుడి ప్రాంతం, ఎన్టీఆర్ మార్గం మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. వినియోగదారులు ఈ విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే. రాంబాబు విజ్ఞప్తి చేశారు.

# సీతానగరం పిహెచ్‌సిలో ప్రధానమంత్రి స్వాత్య మాతృత్వ అభియాన్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి స్వాత్య మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో భాగంగా పిహెచ్సి వైద్యులు డాక్టర్ భవాని, డాక్టర్ ఎం శైలజ రాణి ఈ శిబిరానికి వచ్చిన 54 మంది గర్భిణీ స్త్రీలను పరీక్షించి వారికి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి తగిన మందులు ఉచితంగా అందించారు వీరిలో 11 మందిని హైరిస్క్ గర్భిణీలుగా గుర్తించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. భవాని మాట్లాడుతూ ప్రతి గర్భిణీ స్త్రీ క్రమం తప్పకుండా నెలకొకసారి డాక్టర్ తో వైద్య పరీక్షలు చేయించుకోవాలని తగిన పౌష్టికాహారం తీసుకుంటూ మనసు ప్రశాంతంగా ఉంచు కొని విశ్రాంతి తీసుకోవాలని, వైద్యులు నిర్దేశించిన మందులు సమయానికి తీసుకోవాలని, ద్రవప్రదార్థములు తరచుగా తీసు కోవాలని ,తద్వారా తల్లి మరియు తల్లి కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ హెచ్ఈఓ వైఎస్ రాయుడు,పి హెచ్ ఎన్.కె ఆదిలక్ష్మి, సూపర్వైజర్ ఎన్ అనురాధ, స్టాఫ్ నర్స్ కిరణ్మయి, ఎల్ టి శిల్ప, ఫార్మసిస్టు నగేష్,ఎం ఎల్ హెచ్ పీ లు, ఆశా కార్యకర్తలు, ఆసుపత్రి ఒపి సిబ్బంది పాల్గొన్నారు.



ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు

# రాజకీయ పార్టీల సహకారం అవసరం

జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఖచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితాల రూపకల్పన కోసం కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన ఓటరు జాబితాను స్వచ్ఛంగా, కచ్చితంగా రూపొందించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్-2026) కార్యక్రమానికి సంబంధించిన సందేహాలను నివృత్తి చేశారు. గత రెండు దశాబ్దాలుగా వేగవంతమైన పట్టణీకరణ, ఉపాధి, విద్య కోసం జరిగిన వలసలు, జనాభా మార్పుల కారణంగా మరణించిన వ్యక్తుల పేర్లు ఓటరు జాబితాలో కొనసాగడం, ఒకే వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ నమోదులు ఉండడం, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లు తొలగించబడకపోవడం వంటి సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి గణన ఫారాల పంపిణీ, సేకరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం ఈ ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ కూడా జూలై 14 వరకు కొనసాగుతుందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాను జూలై 21న ప్రచురిస్తామని, అదే రోజు నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరిస్తామని వెల్లడించారు. అనంతరం జూలై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు విచారణలు, దావాలు, అభ్యంతరాల పరిష్కారం చేపట్టి, తుది ఓటరు జాబితాను సెప్టెంబర్ 22న ప్రచురిస్తామని తెలిపారు. ఆధార్ కేవలం గుర్తింపు రుజువు మాత్రమేనని, అది పౌరసత్వం లేదా నివాసానికి చట్టబద్ధమైన రుజువు కాదని స్పష్టం చేశారు. అయితే ఎన్నికల చట్టాల ప్రకారం గుర్తింపు నిర్ధారణ కోసం ఆధార్‌ను ఉపయోగించవచ్చని చెప్పారు. ఎటువంటి వ్యక్తి పేరును విచారణ లేకుండా, కారణాలతో కూడిన ఉత్తర్వులు జారీ చేయకుండా ఓటరు జాబితా నుంచి తొలగించబోమని హామీ ఇచ్చారు. ప్రతి పౌరుడు గణన ఫారాలను సక్రమంగా సమర్పించి ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటరు జాబితా స్వచ్ఛత అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హులెవరూ జాబితాలో లేకుండా ఇంటింటి సర్వే పకడ్బందీగా కొనసాగుతోందన్నారు. పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తూ అధికారులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, బీఎల్వోలు ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా కచ్చితత్వం కోసం బీఎల్వోలకు బీఎల్ఏలు సహకరించాలని, ప్రత్యేక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. జిల్లాలో మొత్తం 10,19,551 మంది ఓటర్లలో 78 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని తెలిపారు. రామచంద్రపురంలో 80.86 శాతం, ముమ్మిడివరంలో 74.12 శాతం, అమలాపురంలో 75.77 శాతం, రాజోలులో 76.90 శాతం, పి. గన్నవరంలో 79.85 శాతం, కొత్తపేటలో 78.33 శాతం డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. ప్రత్యేక సర్వే ద్వారా ఇప్పటివరకు 18,275 మంది మరణించిన ఓటర్లను గుర్తించామని తెలిపారు. గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని చెప్పారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మందికి పైగా ఓటర్లు ఉండటం, భౌగోళిక పరిస్థితులు, దూర ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని 93 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. ఎలాంటి ప్రభావాలకు తావు లేకుండా నిష్పక్షపాతంగా సర్వే ప్రక్రియను పూర్తి చేస్తున్నామని, ఓటర్లకు మెరుగైన సేవలు అందించేందుకు భారత ఎన్నికల సంఘం 1950 హెల్ప్‌లైన్ అందుబాటులో ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి, డీఆర్వో వి. సుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి వడ్డీ నాగేశ్వరరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామవర్మ, వైఎస్సార్సీపీ ప్రతినిధి సంసాని నాని, టీడీపీ ప్రతినిధి భాస్కర్ల రామకృష్ణ, ఈఆర్వోలు జి.వి.వి. సత్యనారాయణ, డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి తీసుకుంటే క్షణాల్లో దొరికిపోతారు

## సరికొత్త డిటెక్షన్ కిట్లతో పోలీసుల తనిఖీలు : జిల్లా ఎస్పి రాహుల్ మీనా



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాను గంజాయి, మత్తుపదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపీఎస్ ఆదేశాల మేరకు మత్తుపదార్థాలు సేవించే వారిని, సరఫరా చేసే వారిని వేగంగా గుర్తించేందుకు అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్లను వినియోగిస్తూ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ పర్యవేక్షణలో, రామచంద్రపురం సీఐ వెంకటనారాయణ, ఎస్‌బీ సీఐ పుల్లారావు, ఈగల్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్లు, పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. తనిఖీల సందర్భంగా అనుమానితులను నిలిపి అత్యాధునిక బయోచెక్ డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు. అనుమానితుల నుంచి సేకరించిన మూత్రం లేదా లాలాజల నమూనాలను పరీక్షించగా కేవలం రెండు నిమిషాల్లోనే ఫలితాలు వెల్లడయ్యాయి. ఈ అకస్మాత్తు తనిఖీల్లో మొత్తం 18 మందికి మత్తుపదార్థాలు సేవించినట్లు పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. మత్తుకు బానిసలైన ఈ 18 మందిని వ్యసన విముక్తి కేంద్రాలకు తరలించి చికిత్స, కౌన్సెలింగ్ అందించే చర్యలు చేపట్టారు. అలాగే వారిపై చట్టప్రకారం అవసరమైన న్యాయపరమైన చర్యలు కూడా తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ, జిల్లాలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల నిర్మూలనే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని తెలిపారు. ఇకపై గంజాయి లేదా ఇతర డ్రగ్స్ సేవించి తప్పించుకోవడం సాధ్యం కాదని హెచ్చరించారు. అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్ల ద్వారా కేవలం రెండు నిమిషాల్లోనే గంజాయితో పాటు 11 రకాల ఇతర మత్తుపదార్థాలు వినియోగించారా లేదా అనే విషయాన్ని ఖచ్చితంగా గుర్తించవచ్చని చెప్పారు. యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న మత్తుపదార్థాలపై పోలీస్ శాఖ ఉక్కుపాదం కొనసాగుతుందని, జిల్లా వ్యాప్తంగా నిరంతరం నిఘా, తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. మత్తుపదార్థాల విక్రయం, రవాణా లేదా వినియోగానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మత్తుకు బానిసలైన వారిని గుర్తించి కౌన్సెలింగ్, డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి కూడా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక డ్రగ్ డిటెక్షన్ కిట్ల వినియోగంతో నిందితులను వేగంగా గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం మరింత సులభమైందని, రానున్న రోజుల్లో జిల్లా వ్యాప్తంగా తనిఖీలను మరింత ముమ్మరం చేస్తామని ఎస్పీ తెలిపారు.

# రోడ్డెక్కిన వన్నెచింతలపూడి కౌలు రైతులు

## సాగునీరు లేక నారుమళ్లు వేయలేక విలవిలలాడుతున్న రైతులు
## అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం పంటలు కాపాడాలని వేడుకోలు - స్పందించకపోతే భారీ ఉద్యమానికి హెచ్చరిక



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం రూరల్ మండలం వన్నెచింతలపూడి గ్రామంలో సాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. కాలువల్లో నీరు విడుదల కాకపోవడంతో వందలాది ఎకరాల్లో వరి సాగు అనిశ్చితిలో పడింది. నారుమళ్లు వేయాల్సిన కీలక సమయంలో నీరు అందకపోవడంతో కౌలు రైతులు తీవ్ర ఆందోళనకు గురై గురువారం రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ప్రతి సంవత్సరం జూన్ 12 నాటికే కాలువల్లో సాగునీరు వచ్చేదని, ఈసారి మాత్రం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇప్పటికీ నీరు అందక పంటల సాగు పూర్తిగా దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ, సాగునీటి శాఖ అధికారులు సమస్యను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వన్నెచింతలపూడితో పాటు ఇమ్మిడివరప్పాడు, శెట్టిపల్లి, తాండవపల్లి గ్రామాలకు చెందిన రైతులు కూడా సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. నారుమళ్లు వేయాల్సిన సమయం దాటిపోతుండటంతో ఈ ఏడాది వరి సాగు ఆలస్యమై దిగుబడులు తీవ్రంగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. "వ్యవసాయమే మా జీవనాధారం. అప్పులు చేసి కౌలుకు భూములు తీసుకుని సాగు చేస్తున్నాం. సమయానికి నీరు అందకపోతే మా పెట్టుబడులన్నీ వృథా అవుతాయి. పంటలు వేయలేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం రైతే దేశానికి వెన్నెముక అంటోంది. కానీ ఆ మాటలు ప్రసంగాలకే పరిమితమవుతున్నాయి. రైతుల కష్టాలు మాత్రం ఎవరికీ కనిపించడం లేదు" అంటూ కౌలు రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ఒకవైపు వన్నెచింతలపూడి పరిసర గ్రామాల్లో సాగునీరు లేక రైతులు నారుమళ్లు కూడా వేయలేక తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు చిందాడగరువు ప్రాంత రైతులు మోటార్ల సహాయంతో సాగు పనులు ప్రారంభించడం తమకు మరింత బాధ కలిగిస్తోందని రైతులు పేర్కొన్నారు. అధికారులు సాగునీటి పంపిణీలో సమానత్వం పాటించడం లేదని, పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నారుమళ్లు వేసే సమయం దాటిపోతే వరి సాగు పూర్తిగా దెబ్బతిని భారీ ఆర్థిక నష్టాలు తప్పవని, ఇప్పటికే అప్పుల భారం మోయలేక సతమతమవుతున్న కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని వారు తెలిపారు. సాగునీరు అందక క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి వస్తే దానికి పూర్తిగా ప్రభుత్వ యంత్రాంగమే బాధ్యత వహించాలని రైతులు స్పష్టం చేశారు. కౌలు రైతుల సమస్యను ప్రభుత్వం అత్యవసరంగా పరిగణించి వెంటనే కాలువల్లో సాగునీరు విడుదల చేయాలని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి కౌలు రైతుకు ప్రభుత్వం అండగా నిలిచి పంటలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వరిచేలకు సాగునీరు విడుదల చేయాలని, లేనిపక్షంలో అన్ని గ్రామాల రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని రైతులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రైతులు పెయ్యాల సత్యనారాయణ, పరమట వసంతరావు, లంక సత్యనారాయణ, బాలయోగి, ప్రసాద్, సుదర్శన్, వెంకటేశ్వరరావు, అత్తిలి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి పీచు పరిశ్రమల అభివృద్ధికి

# కోనసీమలో భారీ కాంక్లేవ్



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ జిల్లా ప్రజల ప్రధాన జీవనోపాధి అయిన కొబ్బరి ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి ఊతమిచ్చే లక్ష్యంతో ఈ నెల 16, 17 తేదీల్లో అనాతవరం కన్వెన్షన్ హాల్‌లో "కోనసీమ క్వాయర్ కాంక్లేవ్" నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన సన్నద్ధత సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే మూడు నెలల్లో జిల్లాలో కనీసం 50 కొత్త కొబ్బరి పీచు పరిశ్రమలు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రెండు రోజుల సదస్సులో కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నిపుణులు పరిశ్రమల స్థాపన, ప్రభుత్వ రాయితీలు, ఆధునిక సాంకేతికత, మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పించనున్నారు. డీఆర్‌డీఏ, ఉద్యాన శాఖల ద్వారా 350 మంది మహిళలు, యువత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించగా, క్యూ ఆర్ కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించారు. సదస్సు ప్రాంగణంలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక సమాచార స్టాల్స్ కూడా ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో లభించే కొబ్బరి పీచులో ప్రస్తుతం కేవలం 20 శాతం మాత్రమే వినియోగంలో ఉందని, మిగిలిన పీచును సంపదగా మార్చి గ్రామీణ పారిశ్రామికీకరణకు, మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే కాంక్లేవ్ ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. 'ఒక జిల్లా-ఒక ఉత్పత్తి' పథకం కింద కోనసీమ కొబ్బరి, కొబ్బరి పీచు ఉత్పత్తులకు విలువ జోడించి అంతర్జాతీయ మార్కెట్‌కు అనుసంధానం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, జిల్లా ఉద్యాన అధికారి బి.వి. రమణ, ఏపీఐఐసీ అధికారులు, లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డ్, సిడ్బీ ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సర్ స్పెషల్ ఇంటెన్సివ్ కార్యక్రమంలో పాల్గొన్న అంగర



**అంబాజీపేట విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం ఉదయం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం కే.పెదపూడి గ్రామంలో సర్ స్పెషల్ ఇంటెన్సివ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు పాల్గొని కే.పెదపూడి గ్రామంలో బూత్ నెంబర్ 139,140,141, బూతుల్లో పర్యటించి ఓటర్ వద్దకు వెళ్లి ఓటర్సును, వివరాలు అడిగినారు. జూలై 14 లోపు పూర్తి చేయాలని నిర్దేశించినారు. అలాగే 2029లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేయలని వాటర్సను కోరిన ఎక్స్ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రావు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో కన్వీనర్స్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, మోకా ఆనంద్ సాగర్, ఏపీ ఇండస్ట్రియల్ డైరెక్టర్ మట్టపతి భారతి అంబాజీపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గూడాల ఫణి, ప్రధాన కార్యదర్శి, రవణం రాము, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇంచార్జ్ పితాని కేశవ, గ్రామ శాఖ అధ్యక్షులు, తిరుమనాథం హనుమంతరావు, ఎంపిటిసి పబ్బినీడి రాంబాబు, యూనిట్ ఇంచార్జ్లు, గుబ్బల నాగ వెంకటరమణ, దాసరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబాన్ని

# పరామర్శించిన ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు





**ఐ.పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఐ.పోలవరం మండలం గుత్తినదీవి గ్రామంలోని కరవాకులంకకు చెందిన తాళ్ల సత్యవతి నివాసంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో ఇల్లు పూర్తిగా దగ్ధమై తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా తాళ్ల సత్యవతి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే రాబోయే రోజుల్లో ప్రభుత్వ గృహ నిర్మాణ పథకం ద్వారా ఉచితంగా ఇంటి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా బాధిత కుటుంబానికి నిత్యవసరాలు సామాగ్రి అందించారు. అగ్నిప్రమాదం వల్ల జరిగిన నష్టాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి తగిన సహాయం అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. అనుకోని ప్రమాదంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వం తమకు అండగా నిలుస్తాయని దాట్ల సుబ్బరాజు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయ, సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్, పురుషోత్తం (జనసేన పార్టీ), ఎస్సై, తహసీల్దార్, స్థానిక నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

**ప్రజల దృష్టికి**

**నా డిగ్రీ ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ (Degree TC) పోగొట్టుకున్నాను. ఎవరికైనా ఈ సర్టిఫికేట్ దొరికినట్లయితే దయచేసి క్రింది నంబర్‌కు సంప్రదించగలరు.**

**చేదురి వెంకటరమణ మూర్తి**

సెల్: 99596 66819

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

శుక్రవారం, 10 జూలై 2026
www.viswamvoice.com






### కాకినాడ జిల్లా నోడల్ ఏఈఎస్‌గా

# కె.రామమోహనరావు బాధ్యతల స్వీకారం



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నార్త్ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సేవలందిస్తున్న కె.రామమోహనరావు పదోన్నతి పొంది అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఈ క్రమంలో ఆయనను కాకినాడ జిల్లా నోడల్ అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఏఈఎస్)గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కె.రామమోహనరావు 2026 జూన్ 9వ తేదీన కాకినాడ జిల్లా నోడల్ ఏఈఎస్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పోలీస్ శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ పరిపాలనా అనుభవం సంపాదించిన ఆయన, ఇప్పుడు ఎక్సైజ్ శాఖలో కీలక బాధ్యతలు చేపట్టడం విశేషంగా మారింది. జిల్లాలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖకు సంబంధించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ, అక్రమ మద్యం నియంత్రణ, శాఖ పరిపాలనా వ్యవస్థ బలోపేతం, ప్రభుత్వ విధానాల అమలులో తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కొత్త బాధ్యతలు స్వీకరించిన కె.రామమోహనరావుకు అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

# మాట నిలబెట్టుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

**కేవలం పది రోజుల్లోనే ద్రాక్షారామం అగ్నిబాధితులకు నూతన షెడ్లు - పునరావాసానికి శ్రీకారం**

**మన ద్రాక్షారామం.. మన బాధ్యత' నినాదాన్ని కార్యరూపంలోకి తెచ్చిన మంత్రి సుభాష్ - మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యం**

**ఘనంగా నూతన మార్కెట్ షెడ్లు ప్రారంభించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్**

**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో, ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇటీవల ద్రాక్షారామం మార్కెట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 48 దుకాణాలు పూర్తిగా దగ్ధమై అనేక కుటుంబాలు ఉపాధిని కోల్పోయిన విషాద ఘటనపై వెంటనే స్పందించిన మంత్రి సుభాష్, అర్ధరాత్రి వేళనే ఘటనాస్థలికి చేరుకుని బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంతేకాకుండా రూ.20 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించడంతో పాటు, సమాజంలోని దాతలను కూడా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మంత్రి పిలుపుకు విశేష స్పందన లభించింది. మానవత్వంతో స్పందించిన దాతలు సుమారు రూ.50 లక్షల వరకు సహాయాన్ని అందించేందుకు ముందుకు రావడం మంత్రి సుభాష్‌పై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. బాధితులకు శాశ్వత పునరావాసం కల్పించాలనే సంకల్పంతో మంత్రి సుభాష్, తన తండ్రి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు నూతన షెడ్ల నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. 18 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, అత్యంత వేగంగా నిర్మాణ పనులు పూర్తి చేయించారు. గురువారం నాడు నూతనంగా నిర్మించిన షెడ్లను సత్యం వాసంశెట్టి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మరియు కూటమి పార్టీ నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రజలకు అవసరం వచ్చిన ప్రతిసారి ముందుండి సేవ చేయడమే మంత్రి సుభాష్ లక్ష్యమని అన్నారు. ద్రాక్షారామం మార్కెట్‌ను రాష్ట్రంలోనే మోడల్ మార్కెట్, ఆదర్శ మార్కెట్‌గా తీర్చిదిద్ది, మరిన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని తెలిపారు. ప్రజలకు కష్టకాలంలో తోడుగా నిలుస్తానని ఇచ్చిన మాటను మంత్రి చేతల్లో చూపించారని కొనియాడారు. జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగిన సమయంలో అర్ధరాత్రి వేళ



స్వయంగా సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించడం, వెంటనే రూ.20 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించడం మంత్రి సుభాష్ మానవత్వానికి నిదర్శనమన్నారు. "మన ద్రాక్షారామం – మన బాధ్యత" అనే నినాదంతో దాతలను ప్రోత్సహించి, బాధితులకు విస్తృతంగా సహాయం అందేలా చేయడం గొప్ప నాయకత్వ లక్షణమని ప్రశంసించారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావిస్తూ, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే నాయకుడిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ నిలిచారని, ఇలాంటి సేవా కార్యక్రమాలను కూడా కొందరు విమర్శించడం బాధాకరమని పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజకవర్గానికి మంత్రి సుభాష్ వంటి ప్రజానాయకుడు ఉండడం ప్రజల అదృష్టమని అన్నారు. ప్రకటనలకే పరిమితం కాకుండా, ఇచ్చిన హామీలను కార్యరూపంలో చూపిస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటున్న నాయకుడిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన సేవా నాయకత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ ప్రెసిడెంట్ సుబ్బరాజు, రేవు శ్రీను, వ్యాపారులు, దాతలు, బాధిత కుటుంబాలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిహారం ఇవ్వకుండా మత్స్యకారుల కుటుంబాలను వేధించిన వైసీపీ

**గత ప్రభుత్వ పెండింగ్ బకాయిలైన రూ.13.05 కోట్లను అధికారంలోకి రాగానే చెల్లించాం**

**వైసీపీ హయాంలో మత్స్యకారులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు**

**విశాఖ తీరంలో గల్లంతైన మత్స్యకారుల కోసం యుద్ధ ప్రాతిపదికన గాలింపు చర్యలు చేపట్టాం**

**రాజకీయ లబ్ధి కోసం మత్స్యకారుల సమస్యలను వాడుకోవడం జగన్‌కు తగదు**

**వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మత్స్యకారుల గురించి మాట్లాడే నైతిక హక్కు వైసీపీకి లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన 63 మంది మత్స్యకారుల కుటుంబాలకు చెల్లించాల్సిన పరిహారం, ఇతర పెండింగ్ బిల్లులను కూడా విడుదల చేయకుండా అన్యాయం చేశారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పెండింగ్ బిల్లులను కూటమి ప్రభుత్వం చెల్లించి బాధిత కుటుంబాలకు న్యాయం చేసిందని తెలిపారు. అలాంటి పరిస్థితులు సృష్టించిన జగన్ ఇప్పుడు మత్స్యకారుల గురించి మాట్లాడటం, తన సొంత పత్రికలో తప్పుడు రాతలు రాయించడం విడ్డూరంగా ఉందని, విమర్శలు చేసే ముందు తన ప్రభుత్వ హయాంలో జరిగిన అన్యాయాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. మత్స్యకారుల సంక్షేమం పేరుతో ప్రచారం చేసుకున్న మాజీ సియం జగన్ ప్రభుత్వం ఆచరణలో మాత్రం వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న 63 ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌లకు సంబంధించిన రూ.3.15 కోట్లను 2024 జూలై 8న విడుదల చేసి బాధిత కుటుంబాలకు అందజేశామని చెప్పారు. అలాగే ప్రభుత్వం లో పెండింగ్‌లో ఉన్న రూ.9.90 కోట్ల డీజిల్ (ఆయిల్) సబ్సిడీ బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2024 జూన్ నెలలో విడుదల చేసి మత్స్యకారులకు అందించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మత్స్యకారులకు ఎప్పుడు అండగా ఉంటూ తగిన న్యాయం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం లాగా ఎటువంటి వైఫల్యాలు లేకుండా వారికి సంక్షేమ పథకాలను తూచా తప్పకుండా అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి చెందుతుందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



ఇటీవల విశాఖపట్నం తీరంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన విస్తృత గాలింపు చర్యలు చేపట్టిందన్నారు. భారత కోస్ట్ గార్డ్, భారత నౌకాదళం, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, విశాఖపట్నం పోర్టు అథారిటీతో పాటు సంబంధిత అన్ని సంస్థల సమన్వయంతో నిరంతర గాలింపు కొనసాగించామని తెలిపారు. మత్స్యకారులు గల్లంతైన సమాచారం ప్రభుత్వానికి ఆలస్యంగా అందినప్పటికీ విషయం తెలిసిన వెంటనే యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి అత్యవసర చర్యలు ప్రారంభించామని చెప్పారు. అలాగే సాంకేతిక లోపం కారణంగా ఒడిశా తీరానికి సమీపంలో సముద్ర మధ్యలో చిక్కుకుపోయిన 10 మంది ఆంధ్రప్రదేశ్ మత్స్యకారులను ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించి సురక్షితంగా రక్షించిందని మంత్రి తెలిపారు. ఒడిశా ప్రభుత్వ అధికారులతో నేరుగా సమన్వయం చేసి సంబంధిత యంత్రాంగాన్ని రంగంలోకి దింపడం ద్వారా మత్స్యకారులను సురక్షితంగా ఒడ్డుకు చేర్చడమే కాకుండా, వారికి అవసరమైన వైద్య సహాయం అందించి అనంతరం క్షేమంగా విశాఖపట్నానికి తరలించామని వెల్లడించారు. మత్స్యకారుల ప్రాణాల రక్షణ కోసం ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తుంటే, అలాంటి సమయంలో కూడా రెడ్డి ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం బాధాకరమని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. మత్స్యకారులకు భరోసా కల్పించాల్సిన సమయంలో వారిని రెచ్చగొట్టే విధంగా వ్యవహరించటం పూర్తిగా బాధ్యతారాహిత్యమన్నారు. గత ప్రభుత్వం హయాంలో ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని ప్రచారం చేసుకుందని, కానీ క్షేత్రస్థాయిలో ఆ సాయం సకాలంలో అందక బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని మంత్రి పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో సముద్ర వేటకు వెళ్లి ఎంతమంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయారనే విషయంపై ఇప్పటివరకు ఒక అధికారిక శ్వేతపత్రం కూడా విడుదల చేయలేదని మంత్రి ప్రశ్నించారు. మత్స్యకారుల ఓట్ల కోసం 'భరోసా' పేరుతో ప్రచారం చేసిన గత పాలకులు వేటలో మరణించిన మత్స్యకారుల ఖచ్చితమైన సంఖ్యను ప్రజలకు ఎందుకు వెల్లడించలేదని నిలదీశారు. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, వచ్చిన క్లెయిమ్‌లలో అనేక దరఖాస్తులను బడ్జెట్ లేదనే కారణంతో సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంచిందని మంత్రి విమర్శించారు. మొదటి రెండేళ్లలో వచ్చిన 116 క్లెయిమ్‌లలో 52 క్లెయిమ్‌లను సుదీర్ఘకాలం పరిష్కరించకుండా వదిలేసిన విషయాన్ని గుర్తు చేశారు. సముద్ర తీర ప్రాంతాల్లో కనీస భద్రతా చర్యలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మాత్రం మాటలకే పరిమితం కాకుండా మత్స్యకార కుటుంబాలకు నేరుగా ప్రయోజనం చేకూరే నిర్ణయాలు తీసుకుంటూ వారి సంక్షేమానికి అండగా నిలుస్తోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా నియమితులైన పాటిల్ దేవరాజ్ మనీష్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ని ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయం నందు నూతన అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా నియమితులైన పాటిల్ దేవరాజ్ మనీష్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# ఓటరు ధృవీకరణ పూర్తి చేసుకోవాలి : కమిషనర్




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటరు తమ వివరాలను ధృవీకరించి, ఎన్యూమరేషన్ ఫారాన్ని జూలై 14లోపు తప్పనిసరిగా సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ సూచించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల సహకారంతో ఖచ్చితమైన, పారదర్శకమైన ఓటరు జాబితాను రూపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇప్పటివరకు ఎన్యూమరేషన్ ఫారం అందని ఓటర్లు తమకు సమీపంలోని స్వర్ణ వార్డులు, ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు లేదా సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్‌వో)ను సంప్రదించి ఫారం పొందాలని సూచించారు. ఫారాన్ని పూర్తిగా నింపి, ఫోటో అతికించి గడువులోపు సమర్పించాలని కోరారు. ఉద్యోగం, విద్య, వ్యాపారం తదితర కారణాలతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలను వారి కుటుంబ సభ్యులు లేదా బంధువులు స్వర్ణ వార్డు కార్యదర్శులు, హెల్ప్‌డెస్క్ సిబ్బంది లేదా సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని కమిషనర్ తెలిపారు. దీంతో ఓటరు జాబితా మరింత సమగ్రంగా, ఖచ్చితత్వంతో రూపొందించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జూలై 14తో ధృవీకరణ ప్రక్రియ ముగియనున్నందున, ఇంకా ఎన్యూమరేషన్ ఫారం సమర్పించని అర్హత కలిగిన ఓటర్లు గడువులోగా ప్రక్రియ పూర్తి చేసి ప్రజాస్వామ్య వ్యవస్థలో తమ భాగస్వామ్యాన్ని చాటాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**సి.పి.ఎస్ నాయకుల డిమాండ్**




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** సి.పి.ఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓ.పి.ఎస్) అమలు చేయాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖకు చెందిన సి.పి.ఎస్ ఉద్యోగులు ఈ నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయ సీనియర్ సహాయకులు, సి.పి.ఎస్ జిల్లా సహ కన్వీనర్ పంపన రామారావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఇప్పటికే సుమారు నాలుగు రాష్ట్రాల్లో సి.పి.ఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని శాశ్వతంగా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "పెన్షన్ మన హక్కు" అని నినదిస్తూ, పాత పెన్షన్ పునరుద్ధరణ సాధన కోసం ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరగనున్న "అనంత సాయి మహా సంగ్రామం" కార్యక్రమానికి ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వి.ఆర్.ఓ ల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, సర్వేల సంఘం నాయకురాలు పి. గంగాదేవి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు దంగేటి భద్రరావు తదితర ఉద్యోగ సంఘాల నాయకులు, సి.పి.ఎస్ పరిధిలోని ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రజల ముంగిటకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 'మన వార్డులో మన ఆదిరెడ్డి'**

**45, 46 డివిజన్లలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం**

**సమస్యల పరిష్కారానికి అధికారులకు తక్షణ ఆదేశాలు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, అక్కడికక్కడే పరిష్కార చర్యలు చేపట్టాలనే ఉద్దేశంతో రాజమహేంద్ర వరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చేపట్టిన 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమం మంగళవారం రాత్రి 45, 46 డివిజన్ల పరిధిలోని రామదాసుపేటలో కొనసాగింది. పార్టీ కార్యకర్త ఇంట్లో బస చేసిన ఎమ్మెల్యే వాసు బుధవారం ఉదయం ప్రజలతో కలిసి డివిజన్లలో విస్తృతంగా పర్యటిస్తూ సమస్యలను స్వయంగా తెలుసుకుని అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. స్థానిక ప్రజలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఓర్పుగా విని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలను వెంటనే ప్రారంభించారు. డ్రైనేజీల నిర్వహణ, సీసీ రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, విద్యుత్ అంతరాయాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, కాలువల శుభ్రత, పెన్షన్లు, రేషన్ కార్డులు, ప్రభుత్వ గృహాలు వంటి పలు సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల తీవ్రతను బట్టి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఆలస్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. 'మన వార్డులో... మన ఆదిరెడ్డి' కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజల వద్దకే వచ్చి సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం పట్ల స్థానికులు ఎమ్మెల్యేను అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, సంబంధిత శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

### మహిళల ముంగిటకు కంబాల కానుక..

# పల్లెల్లో పట్టుచీరల పండుగ

- లక్కీడ్రా పద్ధతికి స్వస్తి.. ఎంపిక చేసిన గ్రామాల్లోని ప్రతి మహిళకూ బహుమతి
- గురుపూజోత్సవ కానుకగా పాతిక వేల మంది మహిళా ఉపాధ్యాయులకు పట్టు వస్త్రాలు
- రాజానగరం, జగ్గంపేట, పోలవరం నియోజకవర్గాల పరిధిలో విస్తృత పంపిణీ
- ఈ శనివారం సీతానగరం, శ్రీరంగపట్నం వేదికగా పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- టీచర్స్ ఎమ్మెల్సీగా పోటీ చేయాలని సంఘాల ప్రతిపాదన..
- అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమన్న కంబాల శ్రీనివాసరావు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం కేంద్రంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాసరావు మహిళా సాధికారత, సంక్షేమమే ధ్యేయంగా మరో బృహత్తర కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. గడచిన మూడేళ్లుగా ఆషాఢ, శ్రావణ మాసాలను పురస్కరించుకుని పల్లెల్లోని మహిళలకు బంగారు ఆభరణాలు, కానుకలు అందిస్తున్న ఆయన, ఈ ఏడాది మరింత విస్తృతంగా పట్టుచీరల పంపిణీ చేపట్టనున్నారు. గతంలో లక్కీ డ్రా విధానం ద్వారా పదిహేను వేల నుంచి పాతిక వేల మందికి చీరలు అందజేయగా, ఈసారి ఆ పద్ధతికి స్వస్తి పలికారు. రాజానగరం, జగ్గంపేట, పోలవరం నియోజకవర్గాల పరిధిలో ఎంపిక చేసిన గ్రామాల్లోని ప్రతి మహిళకూ ఎలాంటి మినహాయింపులు లేకుండా పట్టుచీరను బహుమతిగా అందించాలని నిర్ణయించారు. ఈ శనివారం సీతా నగరం, శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో ఈ పంపిణీ మహాకార్యక్రమం లాంఛనంగా ప్రారంభం కానుంది. గ్రామంలో ఎంత మంది మహిళలు ఉంటే, అందరికీ ఈ కానుకలు అందజేయనున్నారు. గతంలో చీరలు అందుకున్న మహిళల ముఖాల్లో కనిపించిన ఆనందమే తనను ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేసేలా ప్రేరేపించిందని ఆయన తెలిపారు. ఇటీవల అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన కంబాల శ్రీనివాసరావు, రాజమహేంద్రవరంలోని మంజీరా హోటల్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలను అధికారికంగా వెల్లడించారు. సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయ వృత్తి పట్ల తనకున్న అమితమైన గౌరవాన్ని ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు చాటుకున్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయులను కూడా ఈ కానుకల పంపిణీలో భాగస్వాములను చేశారు. ఎంపిక చేసిన గ్రామాలతో పాటు, సుమారు పాతిక వేల మంది మహిళా టీచర్లకు ప్రత్యేకంగా పట్టుచీరలు అందజేయనున్నట్లు ప్రకటించారు. సేవా కార్యక్రమాలతో పాటు రాజకీయంగానూ చురుకైన పాత్ర పోషిస్తున్న ఆయన, భారతీయ జనతా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ సంస్థాగత కార్యక్రమాల్లో భాగంగా జగ్గంపేట నియోజకవర్గ బాధ్యతలను సైతం ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఆయన చేస్తున్న నిరంతర ప్రజాసేవను గుర్తించిన కాకినాడకు చెందిన పలు ఉపాధ్యాయ సంఘాలు, వచ్చే ఏడాది జరగనున్న ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి (ఎమ్మెల్సీ) ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన ముందు ప్రతిపాదన ఉంచాయి. దీనిపై స్పందించిన కంబాల, తాను క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తనని, ఎమ్మెల్సీ బరిలో దిగే విషయంపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం, అధిష్టానం తీసుకునే నిర్ణయానికే కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లాలని ఉపాధ్యాయ సంఘాలకు సూచించారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు విద్య, వైద్యపరంగా అండగా నిలుస్తూ కంబాల శ్రీనివాసరావు తన సేవా యజ్ఞాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

### కాపులూ...కాంగ్రెస్‌తో కలవండి

# ముఖ్యమంత్రిని చేస్తాం

**కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వండి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇస్తాం**
**అయోధ్య అవినీతిపై సుప్రీం కోర్టు పర్యవేక్షణలో సిబిఐ విచారణ జరపాలి**
**గోదావరి పుష్కరాలకు రూ. 7000 కోట్ల రూపాయలు విడుదల చేయాలి**
**కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు కాపులు ముఖ్యమంత్రి కాలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ అన్నారు. సుమారు 20 శాతం జనాభా కలిగి, ఓటర్లలో అత్యధిక శాతం ఉన్న కాపు సామాజిక వర్గం రాజకీయంగా తీవ్ర నిర్లక్ష్యానికి, అణచివేతకు గురైందన్నారు. ముఖ్యమంత్రి పదవి ఒక్క రోజు కూడా అనుభవించలేదన్నారు. జగన్, చంద్రబాబు ఇరువురూ కాపులను ముఖ్యమంత్రిగా అంగీకరించరని, వారు లేదా వారి వారసులను మాత్రమే ముఖ్యమంత్రిగా ప్రమోట్ చేసుకుం టారని తెలిపారు. కాపు సామాజిక వర్గం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, ముఖ్యమంత్రి అవుతారని చింతామోహన్ పేర్కొన్నారు. గురువారం రాజమండ్రిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత క్రైస్తవులు ఎస్సీ హోదా కావాలని కోరుతున్నారని, వారు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తే, తప్పకుండా అధికారంలోకి రాగానే, రాజ్యాంగ సవరణ చేసి, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇస్తామన్నారు. బిజెపి అవినీతిలో ముందంజలో ఉందన్నారు. అయోధ్య పేరుతో వేల కోట్ల రూపాయలు సేకరించి వాటిని దుర్వినియోగం చేశారని విమర్శించారు. నిధుల వినియోగంపై సిబిఐతో విచారణ జరిపించి, సుప్రీం కోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస్థ పనితీరుపై ప్రజల్లో రోజురోజుకూ నమ్మకం సన్నగిల్లుతోందని తెలిపారు. ఒకే తరహా కేసుల్లో వేర్వేరు వ్యక్తులకు వేర్వేరు విధాలుగా న్యాయం జరుగుతోందనే భావన ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో జయలలితకు ఒక న్యాయం? జగన్ కు మరో న్యాయమా? అని ప్రశ్నించారు. జగన్ కు మోడీ మద్దతు ఉందన్నారు. అందుకే కేసులు విచారణ ఆలస్యం అవుతోందన్నారు. గోదావరి పుష్కరాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.7000/ కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని చింతా మోహన్ డిమాండ్ చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తొక్కిసలాట జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మురుగు నీరు గోదావరిలో కలుస్తోందని, ఫలితంగా ప్రజలు అనారోగ్యానికి గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీలో అభివృద్ధి ఆశించిన స్థాయిలో కనిపించడం లేదన్నారు. 23 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు తెచ్చామని అంటున్నారు. కానీ 23 జిల్లాలు తిరిగిన నాకు, ఏ ఒక్క జిల్లాలోనూ కోటి రూపాయలు అభివృద్ధి కనిపించలేదన్నారు. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై ప్రజల్లో విమర్శలు వినిపిస్తున్నాయి, ప్రతి చిన్న విషయానికీ కేసులు, అరెస్టులు, పోలీసు 30 యాక్టు పెట్టడం తగదన్నారు.

### ఈ నెల 12న రాజమహేంద్రవరం

# ‘ప్రకృతి వేదిక’లో సంగీత విభావరి

**‘వన్యరాగం’ మ్యూజిక్ జమింగ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక కళలు, సాంస్కృతిక కార్యక్ర మాలను ప్రోత్సహించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుం దని పర్యాటక, సాంస్కృతిక, సినిమా టోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన సాయంత్రం 5 గంటల నుండి 10 గంటల వరకు రాజమహేంద్రవరంలోని ‘ప్రకృతి వేదిక’లో నిర్వహించ తలపెట్టిన ‘వన్యరాగం మ్యూజిక్ జమింగ్’ కార్యక్రమ అధికారిక పోస్ట ర్‌ను గురువారం ఆయన ఆవిష్కరిం చారు. రాజమహేంద్రవరంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ‘వన్యరాగం మ్యూజిక్ జమింగ్’ నిర్వాహకులు రమ్య, పవన్ లు మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలుసు కున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ వివరాలను, దాని విశిష్టతను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూయువత ఇటువంటి వినూత్న సాంస్కృతిక ప్రయోగాలతో ముందుకు రావడం అభినందనీయమని కొనియాడారు. జిల్లాలో కళాకారులను, ఇటువంటి సాంస్కృతిక వేదికలను ప్రోత్సహించేం దుకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ వన్య రాగం మ్యూజిక్ జమ్మింగ్ కార్యక్రమం ఘన విజయం సాధించాలని నిర్వాహక బృందానికి మంత్రి దుర్గేష్ శుభాకాంక్షలు తెలియజేశారు.

### రాబోయే తరాలకు

# త్రాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

**సమగ్ర తాగునీటి పథకానికి రూ.24.30 కోట్లతో ఎమ్మెల్యే వేగుళ్ళ శంకుస్థాపన**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటలో ఎటువంటి తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. రూ.24.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్న మండపేట పురపాలక సంఘ సమగ్ర రక్షిత మంచినీటి సరఫరా పథకం – అమృత్ 2.0 పనులకు గురువారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు వేద మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ, మండపేట ప్రజలకు 24 గంటలు నాణ్యమైన, సురక్షితమైన, స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం గా పేర్కొన్నారు. అమృత్ 2.0 కింద చేపడుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తయిన తర్వాత పట్టణంలోని ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీరు అందుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మండపేట నియోజకవర్గంలో అవసరమైన అన్ని అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. పురపాలక సంఘం పరిధిలో అన్ని రోడ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. డ్రైన్ లు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నీటి సరఫరా సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, మాజీ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి, మాజీ వైస్ ఛైర్మన్ పిల్లి గణేష్, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, బిజెపి నాయకులు కోన సత్యనారాయణ, కోటిపల్లి సాయిరాం గొడవర్తి రామచంద్రరావు, కమీషనర్ టీవీ రంగారావు, పబ్లిక్ హెల్త్ డిఇ విజయ పార్వతీ, ఏఇ జి.సందీప్, డిఇ కింతాడ శ్రీనివాస్, ఏఇలు దాసరి పవన్ అనూష లక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు ఈ క్రింది గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ సబ్ స్టేషన్ పరిధిలో చెట్లు కొమ్మలు తొలగించడం పనుల నిమిత్తం 11కెవి కోరుకొండవీనా ఫీడర్ లో ఈ కింది గ్రామాలకు విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి సామ్యూల్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఏడుగంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరాను నిలుపుదల చేయబడుతుందన్నారు. కోరుకొండ మండలంలోని కోరుకొండ, జంబుపట్నం, పశ్చిమ గోనగూడెం, కాపవరం ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు అందరూ ఈ ఆసౌకర్యమును గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలన్నారు.

# పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ బాధితుల ఆందోళన

### నష్టపరిహారం కోసం నిరసన



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం పురుషోత్తపట్నం టు ఇరిగేషన్ ప్రాజెక్టు వల్ల భూములు కోల్పోయిన బాధితులు తమకు రావలసిన పరిహారం కోసం నిరసనకు దిగారు ప్రభుత్వాలు మారుతున్న తమనెవరు పట్టించుకోవడంలేదని తీవ్ర అవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రభుత్వం నుండి దాదాపు 30 కోట్ల పరిహారం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ఎంతమందికి మొరపెట్టుకున్న ఏ ప్రభుత్వము తమ బాధలను పట్టించుకోలేదని గత రెండు ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుందని పేర్కొన్నారు. రోజూ ఎన్నో పథకాలకు నిధులు విడుదలవుతున్నప్పుడు తమకు రావలసిన 30 కోట్లు ఎందుకు ఆపుతున్నారని ప్రశ్నించారు. గతంలో ఇరిగేషన్ మంత్రి హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదని మండిపడ్డారు. నిరసనలో పాల్గొన్న ఒక మహిళ బాధితురాలు మాట్లాడుతూ తాము నరకాన్ని అనుభవిస్తున్నా మని వివరించారు. గత ఏడాది కాలంలో క్యాన్సర్ తో పోరాడుతున్నారని బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొంది మే నెలలోనే ఇంటికి వచ్చిన ఆమె తీవ్ర నీరసంగా ఉన్నప్పటికీ ఆర్థిక సాయం లేక తమ హక్కుల కోసం నిరసన స్థలానికి రావాల్సి వచ్చిందని అన్నారు. భూములు కోల్పోయిన కుటుంబాల్లోని పిల్లలు చదువుకున్నప్పటికీ ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో న్యాయం జరగలేదని, పరిహారం అందుతుందని ఆశపడిన ఓటిపి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు గడుస్తున్న పరిస్థితి మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వెంటనే న్యాయం చేసి తమకు రావలసింది పరిహారాన్ని విడుదల చేయాలని బాధితులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. సిఎంఓ కార్యాలయం నుంచి రైతులకు 45 రోజుల్లో పరిహారం అందించే ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యేబత్తుల బలరామకృష్ణ, రాజానగరం టిడిపి ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కాకినాడ టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ రైతులకు హామీ ఇచ్చారు. 45 రోజులలో పరిహారం అందకపోతే ప్రాజెక్టుల వద్ద రైతులతో పాటు తాము కూడా ఆందోళనలో భాగస్వామ్యం వహిస్తామని హామీ ఇచ్చారు. మీరు ఇచ్చిన హామీపై ఆందోళన విరమిస్తున్నట్లు రైతు నాయకులు బాలకృష్ణ స్పష్టం చేశారు.

# ఆహ్లాదం పంచేలా పార్కుల అభివృద్ధి

**ప్యాకేజీ-4లోని పార్కులను పరిశీలించిన కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా.. పార్కుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదే శించారు. గురువారం ఉదయం ఇంజనీరింగ్ అధికారులతో కలసి ప్యాకేజీ-4 లోని పార్కులను పరిశీలించారు. సాయిచైతన్య నగర్ పార్క్, సుబ్రహ్మణ్య నగర్ పార్క్, హార్లిక్స్ ఫ్యాక్టరీ లేఅవుట్ పార్క్, అల్యూమినియం ఫ్యాక్టరీ లేఅవుట్ పార్క్‌లను సందర్శించి.. ప్రణాళికా బద్ధంగా, ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది వాకింగ్ చేయడానికి అనుకూలంగా, ఇతరులను దాటుకుని వెళ్లడానికి తగినంత స్థలం ఉండేలా వాకింగ్ ట్రాక్ లను విశాలంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పార్కులోనూ కనీస వసతులు ఉండేలా చూడాలని.. త్రాగునీరు, టాయిలెట్లు, లైటింగ్, ప్రహరీ, గేటు, సేదదీరడానికి బెంచీలు, వాకింగ్ ట్రాక్, గ్రీనరీ ఉండేలా చూడాలన్నారు. అలాగే పార్కు విస్తీర్ణం, అనుకూలతను బట్టి షటిల్ కోర్టు, జిమ్ పరికరాలు, పిల్లల ఆట పరికరాలు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి వేళల్లో పార్కు సురక్షితంగా ఉండేందుకు విద్యుత్ దీపాలు ఉండాలన్నారు. అదేవిధంగా ప్రజలను భాగస్వాములను చేసి పార్కు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఈఈ మాధవి, ఎంహెచ్ఓ వినూత్న, డీఈ లోవరాజు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

### సోషల్ మీడియాను షేక్ చేస్తోన్న

# ‘టాక్సిక్’ బోల్డ్ సాంగ్..

## ఈ సినిమాకు కియారా పారితోషికం ఎంతో తెలుసా?



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా నటించిన లేటెస్ట్ సినిమా టాక్సిక్. తాజాగా ఈ సినిమా నుంచి ఒక రొమాంటిక్ సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. బుధవారం (జులై 09) విడుదలైన ఈ సాంగ్ లో కియారా చాలా బోల్డ్ గా నటించింది. 'రాకింగ్ స్టార్' యష్ హీరోగా, గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ‘టాక్సిక్‘. 'కేవీఎన్ ప్రొడక్షన్స్' సంస్థ భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పాన్ ఇండియా లెవెల్ లో ఈ మూవీని నిర్మిస్తోంది. యశ్ సరసన నయనతార, కియారా అద్వానీ హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ ఈ సినిమాలో హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడిన ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఎట్టకేలకు ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్, టీజర్స్ హాట్ టాపిక్ గా మారాయి. సినిమాలో హింసతో పాటు రొమాంటిక్ సీన్స్ ఓ రేంజ్ లో ఉన్నాయని అర్థమైంది. ఇక తాజాగా ‘టాక్సిక్’ సినిమా నుంచి ‘తబాహి’ వీడియో సాంగ్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో కియారా అందాలు ఆరబోసింది. గతంలో ఎన్నడూ లేనంతగా హాట్ హాట్ గా కనిపించింది. అందుకు తగ్గట్టుగానే యూట్యూబ్‌లో విడుదలైన నిమిషాల వ్యవధిలోనే తబాహి సాంగ్ ట్రెండింగ్ లోకి వెళ్లిపోయింది. ఇప్పటికే ఈ సాంగ్ కు మిలియన్ల కొద్దీ వ్యూస్ వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తబాహి సాంగ్ ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతోంది. అదే సమయంలో ఈ సినిమా కోసం కియారా తీసుకున్న రెమ్యునరేషన్ పై కూడా చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో కియారా చాలా హాట్‌గా కనిపించింది. అందుకోసం ఆమె భారీ పారితోషికం డిమాండ్ చేసిందని తెలుస్తోంది. అయితే పాన్ ఇండియా లెవెల్ లో కియారాకు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఆమె అడిగిన పారితోషికాన్నే నిర్మాతలు ఇచ్చారని తెలుస్తోంది. ‘టాక్సిక్’ చిత్రం కోసం కియారా అద్వానీకి ఏకంగా రూ.15 కోట్లు పారితోషికంగా చెల్లించినట్లు తెలుస్తోంది. ఇది ఆమె సినీ కెరీర్‌లోనే అత్యధిక పారితోషికం. 'గేమ్ ఛేంజర్' సినిమాకు కియారా సుమారు రూ. 5 నుంచి 7 కోట్ల పారితోషికం అందుకుంది. దానితో పోలిస్తే, ‘టాక్సిక్’ సినిమాకు ఆమె రెమ్యునరేషన్ డబుల్ అయ్యింది. కియారా అద్వానీకి బాలీవుడ్‌లోనే కాకుండా దక్షిణాదిలో కూడా మంచి డిమాండ్ ఉంది. అందుకే టాక్సిక్ నిర్మాతలు ఈ రేంజ్ రెమ్యునరేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ భారీ పారితోషికంతో, కియారా అద్వానీ అధికారికంగా భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యధిక పారితోషికం తీసుకునే స్టార్ హీరోయిన్ల సరసన చేరింది.

# ఇంటిమేట్ సీన్స్ చేయడానికి కారణం ఇదే..

## అసలు విషయం చెప్పిన అందాల కామాక్షి భాస్కర్ల



సినీ పరిశ్రమలో తనదైన గుర్తింపు కోసం ప్రయత్నిస్తున్న నటి కామాక్షి భాస్కర్ల. కేవలం గ్లామర్‌కు పరిమితం కాకుండా, నటనకు, కథాంశానికి ప్రాధాన్యత ఇస్తూ తన ప్రత్యేకమైన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. ఒక క్వాలిఫైడ్ డాక్టర్‌గా, ఇండిపెండెంట్ మహిళగా, సినీ రంగంలో తన అనుభవాలను, పాత్రల ఎంపిక వెనుక గల తన ఆలోచనలను ఆమె పంచుకున్నారు. అందాల భామ కామాక్షి భాస్కర్ల గతంలో ఓ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో హీరో బయాస్, మేల్ సెంట్రిక్ ధోరణి ఉందని అభిప్రాయపడిన కామాక్షి, “మహిళలు కేవలం అందంగా కనిపించడానికి మాత్రమే పరిమితం కారాదు” అనే తన ఎజెండాను మొదటి నుంచీ కలిగి ఉన్నానని తెలిపారు. థియేటర్ నేపథ్యం నుంచి వచ్చిన ఆమె, క్రాఫ్ట్‌పై తనకున్న అవగాహనను, నమ్మకాన్ని తెలిపారు. కేవలం గ్లామరస్ పాత్రలు చేసి తాను ఏం సాధిస్తానని ఎప్పుడూ ప్రశ్నించుకుంటానని, సబ్జెక్టివ్ ఎలిమెంట్ అయిన అందం కంటే, బ్యూటీ స్టాండర్డ్స్‌కు ఫిట్ అవ్వడం అనేది ఒక ప్రొఫెషనల్ అంశమని ఆమె వివరించారు. అందుకే, మొదటి నుంచీ డిఫరెంట్, ఇంట్రెస్టింగ్ పాత్రలనే ఎంచుకున్నానని కామాక్షి భాస్కర్ల తెలిపారు. పొలిమేర 1 చిత్రంలో ఇంటిమేట్ సీన్స్ చేసినందుకు చాలా మంది “డాక్టర్ అయ్యుండి ఎందుకు చేశారు?” అని అడిగారని, దానికి సమాధానంగా, “అది వేరే ప్రొఫెషన్, ఇది వేరే ప్రొఫెషన్, ఇందులో నా క్రాఫ్ట్ ఏంటో నాకు తెలుసు కాబట్టి చేశాను” అని ఆమె తెలిపారు. పొలిమేర 2లో లక్ష్మి పాత్ర ఆడియన్స్‌ను థియేటర్లలో కూర్చోబెట్టిందని, విద్యా ప్రాముఖ్యతను తెలియజేసిందని ఆమె గుర్తు చేసుకున్నారు. లైలా చిత్రంలో సుందరి పాత్ర చాలా నావెల్ అని, తన 2010-11 నాటి వ్యక్తిత్వాన్ని పోలి ఉంటుందని వివరించారు. ఒక నటిగా తన ఐడియాలజీకి భిన్నంగా ఉన్న పాత్రలను చేయగలగడమే తన నైపుణ్యమని ఆమె నమ్ముతారు. లైలాలోని సుందరి పాత్రకు డార్క్ స్కిన్ ఉండటం, ఆ పాత్ర విమర్శలకు గురవడం, ఎంతో మంది చిన్న పిల్లలు తన దగ్గరికి వచ్చి, సినిమాలో వాళ్ళలా లేమని బాధపడటం వంటి సంఘటనలు తనకు ఆ పాత్ర ఎంచుకోవడానికి ప్రేరణ అని కామాక్షి చెప్పారు. ఆమె నా క్రష్ అంటున్న రెబల్ స్టార్ ప్రస్తుతం పలు ప్రాజెక్టులలో నటిస్తూ, తన కెరీర్‌లో బిజీగా ఉన్నానని కామాక్షి తెలిపారు. లీడ్ రోల్స్ కాకపోయినా, ప్యాన్ ఇండియా చిత్రాలలో కథాంశాన్ని మలుపు తిప్పే ప్రామినెంట్ పాత్రలకు ఆమె ప్రాధాన్యత ఇస్తున్నారు. తాను ఎప్పుడూ తన నటనను నమ్ముకున్నానని, “ఈ అమ్మాయికి ఎలాంటి రోల్ అయినా ఇవ్వొచ్చు” అని డైరెక్టర్లు, రైటర్లు భావించేలా తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సృష్టించుకోవాలని ఆమె ఆకాంక్షిస్తున్నారు. తెలుగు అమ్మాయిలలో, మహిళా నటులలో అటువంటి స్పేస్ లేదని, తాను దానిని సృష్టించాలనుకుంటున్నానని అన్నారు. కామాక్షి భాస్కర్ల తన సినీ ప్రయాణాన్ని జీరో నుంచి ప్రారంభించానని తెలిపారు. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తన మొదటి చిత్రం అని, అందులో అఖిల్ స్నేహితురాలి పాత్ర చేశానని చెప్పారు. థియేటర్ నేపథ్యం నుంచి వచ్చి, కాస్టింగ్ కాల్స్‌కు దరఖాస్తు చేసుకుంటూ, ఆడిషన్స్ ఇస్తూ చిన్న చిన్న పాత్రల నుండి ఎదిగారు. పొలిమేర 1 తర్వాత ఝులో తన నటనను చూసి, విరూపాక్ష కోసం కార్తీక్ దండు బృందం తనను సంప్రదించిందని అన్నారు. “ఎంత టాలెంట్ ఉన్నా రికగ్నిషన్ లేనప్పుడు ఆఫర్స్ రావు, చిన్న రోల్ అయినా ఇంపాక్ట్ చూపించగలగాలి” అనే సూత్రాన్ని ఆమె నమ్ముతారు.

# నాలుగో టీ20లో ఇంగ్లాండ్ విజయం.. సిరీస్‌ను కోల్పోయిన భారత్

టీ20ల్లో ప్రపంచ ఛాంపియన్‌గా ఉన్న భారత్‌కు మరో షాక్. మొన్న ఐర్లాండ్ చేతిలో రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ గెలవకుండా ఘోర పరాభవాన్ని మూటగట్టుకున్న టీమ్‌ఇండియా.. ఇప్పుడు ఇంగ్లాండ్‌పై కూడా సిరీస్‌ను కోల్పోయింది. భారత్‌తో జరిగిన నాలుగో టీ20లో ఇంగ్లాండ్ 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆతిథ్య జట్టు ఐదు టీ20ల సిరీస్‌ను 3-0తో ఒక మ్యాచ్ మిగిలుండగానే కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ 13.5 ఓవర్లలోనే ఒకే వికెట్ కోల్పోయి ఛేదించింది. జోస్ బట్లర్ (8) త్వరగానే ఔటైనా.. తర్వాత వచ్చిన హ్యారీ బ్రూక్ (79నాటౌట్; 35 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) చెలరేగాడు. ఫిల్ సాల్ట్ (59నాటౌట్; 42 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. టీమ్‌ఇండియా బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (80నాటౌట్; 49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) ఒక్కడే రాణించాడు. వైభవ్ సూర్యవంశీ (15), అభిషేక్ శర్మ (16), శివమ్ దూబె (22), తిలక్ వర్మ (11), ఇషాన్ కిషన్ (4) నిరాశపర్చారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ ఒక్కో వికెట్ పడగొట్టారు. నామమాత్రపు ఐదో టీ20 శనివారం సౌథాంప్టన్‌లో జరగనుంది. భారత్‌తో రెండు లేదా అంతకంటే ఎక్కువ మ్యాచ్‌లు ఉన్న ద్వైపాక్షిక టీ20 సిరీస్‌ను ఇంగ్లాండ్ కైవసం చేసుకోవడం ఇదే తొలిసారి. 159 పరుగుల లక్ష్యఛేదనలో ఇంగ్లాండ్ బ్యాటర్లు దూకుడుగా ఆడేస్తున్నారు. ముఖ్యంగా హ్యారీ బ్రూక్ బౌండరీలతో విరుచుకుపడుతున్నాడు. వాషింగ్టన్ సుందర్ వేసిన ఎనిమిదో ఓవర్‌లో అతను వరుసగా 4, 6, 4, 4 బాదేశాడు. తర్వాత అక్షర్ పటేల్ బౌలింగ్‌లో ఫోర్, సిక్స్ రాబట్టాడు. ఈ క్రమంలోనే 21 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. శివమ్ దూబె వేసిన పదో ఓవర్‌లో కూడా బ్రూక్ రెండు ఫోర్లు కొట్టాడు. దీంతో 10 ఓవర్లు ముగిసేసరికి ఇంగ్లాండ్ స్కోరు 120/1. బ్రూక్ (59), ఫిల్ సాల్ట్ (41) పరుగులతో ఉన్నారు. భారత్‌తో జరుగుతున్న నాలుగో టీ20లో ఇంగ్లాండ్ బ్యాటర్లు పుంజుకున్నారు. గత మూడు ఓవర్లలో ఆ జట్టు 40 పరుగులు చేసింది. ప్రిన్స్ యాదవ్ వేసిన నాలుగో ఓవర్ 15 పరుగులు వచ్చాయి. తర్వాత ప్రసిద్ధ్ వేసిన ఓవర్‌లో ఫిల్ సాల్ట్ మూడు ఫోర్లు బాదాడు. పవర్ ప్లే ముగిసేసరికి ఇంగ్లాండ్ స్కోరు 62/1. బ్రూక్ (18), ఫిల్ సాల్ట్ (26) పరుగులతో ఉన్నారు.



ఇంగ్లాండ్‌తో నాలుగో టీ20లో భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ తొలి రెండు ఓవర్లలో కలిపి ఏడు పరుగులే ఇచ్చారు. అర్ష్‌దీప్ వేసిన మూడో ఓవర్‌లో సిక్స్ కొట్టిన జోస్ బట్లర్ (8) తర్వాత బంతికే వికెట్‌కీపర్ ఇషాన్‌కు క్యాచ్ ఇచ్చాడు. 3 ఓవర్లకు స్కోరు 22/1. హ్యారీ బ్రూక్ (8) పరుగులతో ఉండగా.. ఇప్పటివరకు ఏడు బంతులు ఎదుర్కొన్న ఫిల్ సాల్ట్ పరుగుల ఖాతా తెరవలేదు. ఇంగ్లాండ్ టార్గెట్ 159. ఇంగ్లాండ్‌తో జరుగుతున్న నాలుగో టీ20లో టీమ్‌ఇండియా బ్యాటింగ్ ముగిసింది. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. శ్రేయస్ అయ్యర్ (80నాటౌట్; 49 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. వైభవ్ సూర్యవంశీ (15), అభిషేక్ శర్మ (16), శివమ్ దూబె (22), తిలక్ వర్మ (11), ఇషాన్ కిషన్ (4) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 2, జోఫ్రా ఆర్చర్ 2, విల్ జాక్స్, ఆదిల్ రషీద్ ఒక్కో వికెట్ పడగొట్టారు. భారత్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ హాఫ్ సెంచరీ చేశాడు. 15 ఓవర్లకు జట్టు స్కోరు 116/4. శ్రేయస్ (52నాటౌట్), తిలక్ వర్మ (3నాటౌట్) క్రీజులో ఉన్నారు. విల్ జాక్స్ వేసిన 11వ ఓవర్‌లో శ్రేయస్ సిక్స్ సహా 10 పరుగులు వచ్చాయి. 12వ ఓవర్‌లో సామ్ కరన్ 6 పరుగులు ఇచ్చాడు. 13వ ఓవర్‌లో శివమ్ దూబె ఫోర్ బాదాడు. మొత్తం 7 పరుగులు వచ్చాయి. 13.5 ఓవర్‌లో భారత్ నాలుగో వికెట్ కోల్పోయింది. విల్ జాక్స్ బౌలింగ్‌లో శివమ్ దూబె (22) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. 15వ ఓవర్‌లో సిక్స్‌తో శ్రేయస్ తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్‌లో 13 పరుగులు వచ్చాయి. 10 ఓవర్ల నాటికి భారత్ 71/3 స్కోరు చేసింది. శ్రేయస్ అయ్యర్ (24నాటౌట్), శివమ్ దూబె (10నాటౌట్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేస్తున్నారు. సామ్ కరన్ వేసిన ఆరో ఓవర్‌లో శ్రేయస్ ఓ ఫోర్ బాదాడు. మొత్తం ఏడు పరుగులు వచ్చాయి. 6.4 ఓవర్‌లో భారత్ మూడో వికెట్ కోల్పోయింది. ఆదిల్ రషీద్ బౌలింగ్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ (16) ఔటయ్యాడు. 8వ ఓవర్‌లో శ్రేయస్ ఓ సిక్స్ బాదాడు. తొమ్మిదో ఓవర్‌లో 6 పరుగులు, పదో ఓవర్‌లో 7 పరుగులు వచ్చాయి. 5 ఓవర్లకు భారత్ స్కోరు 37/2. అభిషేక్ శర్మ (13నాటౌట్), శ్రేయస్ అయ్యర్ (4నాటౌట్) క్రీజులో ఉన్నారు. జోఫ్రా ఆర్చర్ వేసిన తొలి ఓవర్‌లో వైడ్ సహా 5 పరుగులు వచ్చాయి. రెండో ఓవర్ జోష్ టంగ్ బౌలింగ్‌లో అభిషేక్ శర్మ ఫోర్, వైభవ్ సూర్యవంశీ ఫోర్, సిక్స్ బాదాడు. మొత్తం 15 పరుగులు వచ్చాయి. 2.4 ఓవర్‌లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో భారత్‌కు తొలి షాక్ తగిలింది. వైభవ్ సూర్యవంశీ (15) క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. ఈ ఓవర్‌లో 4 పరుగులే వచ్చాయి. 4వ ఓవర్‌లో అభిషేక్ శర్మ ఫోర్ కొట్టాడు. ఈ ఓవర్‌లో విల్ జాక్స్ 8 పరుగులు ఇచ్చాడు. 4.2 ఓవర్‌లో జోష్ టంగ్ బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ (4) ఔటయ్యాడు. ఈ ఓవర్‌లో 5 పరుగులు వచ్చాయి. భారత్, ఇంగ్లాండ్ (×చీణ జం జుచీ+) మధ్య నాలుగో టీ20 మ్యాచ్ జరగనుంది. టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. ఇప్పటికే ఇంగ్లాండ్ ఈ సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో ఉంది. సిరీస్ చేజారకుండా ఉండాలంటే భారత్ ఈమ్యాచ్‌లో తప్పక నెగ్గాల్సి ఉంది.

భారత్ తుది జట్టు: అభిషేక్ శర్మ, వైభవ్, ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, దూబె, సుందర్, అక్షర్ పటేల్, ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్, ప్రసిద్ధ్ కృష్ణ. ఇంగ్లాండ్: సాల్ట్, బట్లర్, బ్రూక్, బెతెల్, బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, రెహాన్, అదిల్ రషీద్, ఆర్చర్, జోష్ టంగ్.

ఇంగ్లాండ్ తుది జట్టు: ఫిల్ సాల్ట్, జోస్ బట్లర్ (వికెట్‌కీపర్), హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జాకబ్ బెతెల్, టామ్ బాంటన్, సామ్ కరన్, విల్ జాక్స్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్, జోష్ టంగ్.

టీ20 సిరీస్‌కు.. వరుణ్, హర్షిత్ దూరం

ఇంగ్లాండ్‌తో ప్రస్తుతం జరుగుతున్న టీ20 సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు (నాలుగు, ఐదో టీ20లు) వరుణ్ చక్రవర్తి, హర్షిత్ రాణా దూరమయ్యారు. వారిద్దరూ ఇటీవల జరిగిన మ్యాచ్‌లో గాయాల పాలవడంతో జట్టు మేనేజ్‌మెంట్ ఈమేరకు నిర్ణయం తీసుకుంది. నేడు జరుగుతున్న నాలుగో టీ20 మ్యాచ్‌లో వారి స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్‌ను తుది జట్టులోకి తీసుకుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com